# హృదయోల్లాసం (ఉపవాచకం)

## హద్దులు హద్దులు

- నండూరు సుబ్బారావు



మరది : బావా బావా పన్నీరు, బావని పట్టుకు తన్నేరు.... వీధీ వీధీ తిప్పేరు, వీశడు గంధం పూశేరూ... బావా బావా పన్నీరు!

మామగారు : ఒరే చిన్నాడా, ఏమిటా అల్లరి! అతగాడు వచ్చినప్పటి నుంచీ చూస్తున్నా. ఒకటే వికవికలు... ఒకటే పకపకలు. నవ్వు నాలుగువిధాల చేటు. అలా నవ్వకండీ అంటే వినరేం? అదేమిటో అల్లుడుగారు కూడా ఒక కొత్తాలేదు, ఒక పాతాలేదు, ఏమిటేమిటో మాట్లాడతాడు. వస పోసిన పిట్టలాగ. ఇంతమందిని చూశానుగాని, ఇంత హద్దుమీరిన వాళ్ళను చూడలేదు.

అత్తగారు : ఎంత బావగారయినా కొంచెం హద్దుల్లో వుండాలి నాయనా! అలా అతను సందర్భం లేకుండా మాట్లాడుతుంటే ప్రతివాళ్ళు అతనికేమన్నా పిచ్చేమో అని అనుకుంటున్నారు. కొత్త అల్లుడు కదా! కొంచెం బెట్టుగా, ముక్తసరిగా వుండటం మంచిది కాదూ?

మా : నేను నా పెళ్ళయిన కొత్తలో ఇలాగే వుండేవాడినా!

అత్త : సరే! మీ సంగతే చెప్పండి, ఫలహారం వద్దనేవారు. ఎవరితోనూ అసలు మాట్లాడేవారే కాదు. మిమ్మల్ని చూసి మా ఊళ్ళో వాళ్ళంతా "మరీ యేమిటి ఈయనగారు ముంగిముశానమ్మల్లే వుంటాడూ, మరీ అంత ముళ్ళముప్పితనం పనికిరాదు, దానికీ ఒక హద్దంటూ వుండాలి" అనేవారు.

మా : అది సరేగాని, అల్లుడుగారొచ్చారు గదా అని ఫలహారాలు అంతచేటు చేయడం మంచిది కాదు. దానిక్కూడా ఒక హద్దంటూ పెడుదూ. హద్దుమీరి అన్నీ చేసిపెడితే అతని ఆరోగ్యం పాడవుతుంది. ప్రొద్దున్నే ఇడ్లెన్లు, పదింటికి బొబ్బట్లూ, గారెలతో భోజనం, మధ్యలో కారప్పూసా, మధ్యాహ్నం మొక్కజొన్న పొత్తులూ, రాత్రి తాలింపు శనగలూ యేమిటా చిరుతిళ్ళు?

అల్లు : (బాధపడుతూ) అమ్మో... బాబో.... కడుపునొప్పి... మెలి తిప్పేస్తోంది. నాకొద్దు బాబో అంటే 'తిను తినూ' అంటూ కంచంలో గుమ్మరించారు. వేళాకోళానికని మరదలూ, బావమరదీ పట్టుపట్టి తినిపించారు. దేనికైనా ఒక హద్దుండాలి. నాయనోయ్, బాబోయ్ కడుపునొప్పి.

అత్త : యేమిటి నాయనా బాధపడుతున్నావు?

అల్లు : బాధేమిటి, యమబాధ! మీరు పెట్టిన గారెలూ, బూరెలూ, బొబ్బట్లూ, మొక్కజొన్న పొత్తులూ కడుపులో చేరి మీటింగు పెట్టుకుంటున్నాయి. ఎగిరెగిరి గంతులేస్తున్నాయి. నాయనోయ్.... బాధ!

మరది : బావా నీకు తంపట వేరుశనగకాయలు, తేగలు బాగా ఇష్టంటగా?

అల్లు : ఇప్పుడొద్దు బాబోయ్! తర్వాత చూద్దాం. ఇప్పుడేనా నీ వెధవ వేళాకోళాలు. దేనికయినా హద్దూ పద్దూ వుండాలి. అలా బలవంతాన తినిపించి కదూ నన్నీ స్థితికి తెచ్చారూ! బాబోయ్ నొప్పి.

© SCERT not to be republished

అత్త : కొంచెం అల్లంరసం నూరివ్వనా నాయనా!

మరది : అల్లంరసం పట్టే సందేవుంటే బావగారు మరి రెండు బొబ్బట్లే లాగించేవారు. వారికి బొబ్బట్లు బాగా ఇష్టమట కూడాను.

అల్లు : ఒరే బావా నాకు కోపం వచ్చిందంటే తెలుసా! మొన్న మా వూళ్ళో ఒకడిని చావచితక కొట్టి – అమ్మో కడుపునొప్పి?

మరది : నీ కోపానికి కూడా కొంత హద్దంటూ వుండాలి బావా! మరీ ఎవరిమీద పడితే వాళ్ళమీద, ఎప్పుడు పడితే అప్పుడు అంత కోపం పనికిరాదు.



అత్త : నీవుండరా అతగాడు బాధతో మెలికలు తిరిగిపోతుంటే మధ్యలో నీ గొడవ పనికిరాదు.

మరది : ఎంత కొత్తఅల్లుడయితే మాత్రం, పండక్కి వచ్చాడు గదా అని, గిత్తను మేపినట్లు మేపడమేనా? మీరు కాస్త తగ్గించి పెట్టకూడదా, అతను కాస్త తగ్గించి తినకూడదా?

అల్లు : ఇదే ఆఖరిపండగ. ఇక జన్మలో ఈ వూరు రాను. బాబోయ్ నే చచ్చిపోతున్నా!

అత్త : ఇదెక్కడి అఘాయిత్యమండీ? దిక్కుమాలిన దాన్ని నేనేనా దీనికంతా కారణం. ఏ డాక్టరునన్నా తీసుకురండి. అలా నిలబడి చూస్తారేం?

అల్లు : ఒకపక్క ప్రాణం పోతుంటే తీరిగ్గా ఆలోచిస్తూ కూర్చుంటారేం? ఆలోచనకు కూడా ఒక హద్దుండాలి.

మా : సరేపదండి! అసలే పండక్కి అల్లుడిని తీసుకొచ్చినందుకే బోలెడు ఖర్చు అయింది. అంతచేటు ఖర్చు పనికిరాదే. మన హద్దులో మనముంటే మంచిదే అంటే విన్నావా. ఇప్పుడీ ఆసుపత్రి ఖర్చు కూడానూ!

అత్త : మీ పిసినిగొట్టుతనం బంగారంగానూ! మరీ అంత లోభిత్వం పనికిరాదు. దానికీ ఒక హద్దుండాలి. అవసరం వచ్చినప్పుడు ఖర్చు చేయకపోతే ఎలా?

అల్లు : అమ్మో, నొప్పి, నే బ్రతకను.

మా : సరేపదండి, డాక్టరుగారి దగ్గరకుపోదాం. (డాక్టరుగారి ఆసుపత్రి)

డాక్టరు : ఏమిటండీ! ఆ గావుకేకలు హద్దూపద్దూ లేకుండా?

మా : ఇంకా హద్దేమిటండీ? ఒక ప్రక్క మా అల్లుడు కడుపునొప్పితో మెలితిరిగిపోతుంటే, మీరు

© SCERT not to be republished

అర్జంటుగా పరీక్ష చేయాలి, మీ తతిమ్మా కేసులను కొంచెం హద్దులోపెట్టి ఈ కేసు ముందు చూడాలి!

అల్లు : నే బతకను బాబోయ్.... కడుపునొప్పి.

డా : ఇలా వచ్చి ఈ బల్లమీద పడుకో బాబూ!

అల్లు : మీరంతా కలసి నన్నెత్తి బల్లమీద పడుకోబెట్టండి. నేనుగా పడుకోలేను.

(అందరూ కలసి అల్లుడిని బల్లమీద పడుకోపెడతారు.)

మా : హద్దూ పద్దూ లేకుండా లేడిపిల్లలా ఎగిరిగంతులేసేవాడు. ఎంత అవస్థ వచ్చిపడింది తండ్రీ నీకు! డాక్టరుగారూ! మా వియ్యంకుడుగారికి కబురేమయినా చేయమంటారా?

డా : యేమిటండీ ఆ కంగారు! నన్ను పరీక్ష చేయనీయండి. కంగారుకు కూడా ఒక హద్దుండాలి!...

అల్లు : అన్నిటికీ హద్దులుండాలి. నా కడుపునొప్పికే హద్దులేకుండా పెరిగిపోతోంది బాబోయ్!

డా : వెంటనే ఇతనికి ఆపరేషన్ చేయాలి! కడుపులో ఏమిటేమిటో చాలా కనిపిస్తున్నాయి.

అల్లు : అయ్యబాబోయ్! ఆపరేషనే! అయితే నే బ్రతకను.

డా : మరేం ఫర్వాలేదు బాబూ, నీకేం ఫర్వాలేదు!

మరది : భయానికి కూడా కొంచెం హద్దుండాలి బావగారూ!

అల్లు : నా భయానికేంగాని, నీ అల్లరికి కాస్త హద్దులు పెట్టాలి.

డా॥ : యేమిటి ఆపరేషను చెయ్యమంటారా? వెయ్యిరూపాయలవుతుంది.

మా : వెయ్యిరూపాయలే! అదేమిటి డాక్టరుగారూ, మీ ఫీజుకు మరీ హద్దులేకుండా వుంది.

డా : యేంచేస్తాం! అదంతే... వెయ్యిరూపాయలిచ్చి మనిషిని బ్రతికించుకున్నా సరే! లేకపోతే భగవంతునిమీద భారం వదలి తీసుకుపోయినా సరే!

మా : ఏమే! భగవంతునిమీద భారం వదలి తీసుకుపోదామా ఇంటికి?

అత్త : మీ వేదాంతం మండా, వేదాంతానికి కూడా ఒక హద్దుండాలి. అవతల అతను కిందా మీదా పడుతూ కొట్టు మిట్టాడుతుంటే-

మా : నీ మూలంగానే!

అత్త : మీ మూలంగానే!

మా : కాదు, మీ మూలంగానే, నీ మూలంగానే!

అత్త : మీ మూలంగానే. మీ మూలంగానే.

డా॥ అబ్బబ్బ! యేమిటి మీ పోట్లాటకూడా ఇక్కడేనా? దానికి ఒక హద్దుండాలి.

మా : సరే కానీయండి డాక్టరుగారూ, అంతా మీ దయా, భగవంతుడి దయ.

డా : సరే, నర్స్, ఆపరేషనుకు సిద్ధంచెయ్యి.

అల్లు : అయ్యబాబోయ్! ఎదురుగుండా ఆ రంపమేమిటి దాంతో కోస్తారా?

డా : దేంతో కోస్తే నీకెందుకు? మాట్లాడకుండా ఈ బల్లమీద పడుకోవయ్యా.

(పేషంటు కనిపించకూడదు. డాక్టరు రంపంతో కోసినట్లు అభినయించి పొట్టలోనుంచి బొమ్మలు, గారెలు, చంచాలు, ఇంకా కొన్ని కొన్ని ఒక్కొక్కటిగా తీసి ప్రేక్షకులకు చూపించి పక్కన పెడుతూ వుంటాడు.)

డా : ఏమండీ! పెద్దవాళ్ళెవరో ఒకసారి ఇలా రండి.

అత్త : యేం డాక్టరుగారూ, ఎలా వుంది? ఆపరేషను అయిపోయిందా? కులాసాగా వున్నాడా మా అల్లుడు?

డా : ఏ మల్లుడూ, నా మొఖం అల్లుడు.

© SCERT not to be republished

అత్త : (గుండెలు బాదుకుంటూ) అయిపోయిందా, అయ్యో నా తల్లీ! ఓనా కూతురా! చిన్నతనంలోనే నీకీ అవస్థ-

డా : ఛా.ఛా! ఊరుకోండి. మీ కంగారుకు కూడా ఒక హద్దుండాలి. మీ అల్లుడు నిక్షేపంలా ఉన్నాడు. ఆపరేషను సక్సెస్‌ఫుల్. అతన్ని డిస్టర్బు చేయకండి.

మా : అలాగే బాబూ! జబ్బేమిటసలు?

డా (పెద్దపళ్ళెంలో చూపించి) ఈ పళ్ళెంలో చూడండి! గారెలు, బొబ్బట్లు, వేరుశనగపప్పులు.... ఇవిగో అయిదుపైసల నాణాలు, పదిపైసల నాణాలూ.



మరది : డాక్టరుగారూ నా పెన్ను ఒకటిపోయింది ఉందేమో చూడండి.

అత్త : డబ్బులెక్కడివబ్బా!

మా : నే చెప్పలా,నీ దాపరికంమండా, చిల్లరడబ్బులు తీసుకెళ్ళి మెంతుల డబ్బాలోనూ, పప్పుల డబ్బాలోనూ దాచుకుంటావుగా, శనగపప్పుతోపాటు బొబ్బట్లలో కలిసి లోపలికి వెళ్లుంటాయి.

మరది : తిండికి కూడా ఒక హద్దుండాలండీ. ఏం ప్రపంచంరా బాబూ... అన్నిటికీ ఒకటే హద్దులు. తినడానికి హద్దులు. నవ్వడానికి హద్దులు. ఆలస్యానికి హద్దులు. తొందరకు హద్దులు. చాదస్తానికి హద్దులు... అల్లరికి హద్దులు.. పిసినారితనానికి హద్దులు. ఖర్చుకు హద్దులు... హద్దులు... హద్దులు! అన్నింటికీ ఒకటే హద్దులు!

(అంతా నవ్వుతారు)

© SCERT not to be republished

**కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. ఈ నాటిక సారాంశాన్ని సొంత మాటల్లో రాయండి.
2. ఈ నాటకంలో మీకు నచ్చిన హాస్య సంఘటను రాయండి.
3. హద్దులు హద్దులు నాటకం ద్వారా రచయిత ఇచ్చిన. సందేశాన్ని వివరంగా చర్చించండి.

*ఈ నాటకాన్ని మీ పాఠశాల కార్యక్రమంలో ప్రదర్శించండి.

# సాంస్కృతిక వైవిధ్యం



మన దేశ ప్రత్యేకతను గురించి చెప్పాల్సి వచ్చినపుడు చాలామంది 'భిన్నత్వంలో ఏకత్వం' అనే మాట తరచూ వాడుతుంటారు. ఈ మాట వర్తింపజేసుకునే పరిస్థితులు రాను రాను మన దేశంలో మృగ్యమైపోతున్నాయి. టెక్నాలజీ, రవాణా సౌకర్యాల పెరుగుదల, స్వేచ్ఛావాణిజ్యం మొదలైన అనేక అంశాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా వైవిధ్యం స్థానంలో ఏకరూపత చోటుచేసుకుంటోంది. దీని మూలంగా ఎవరి ఆచార వ్యవహారాలు– సంస్కృతి వారు మర్చిపోయే స్థితికి వచ్చారు. సాంస్కృతిక మూలాల నుండి విడివడి వెలుపలికి వచ్చిన వ్యక్తి ఒంటరితనం, పరాయీకరణ, ఆత్మన్యూనత మొదలైన సమస్యలకు లోనై భారంగా బతుకు నీడుస్తున్నాడు. ఈ సమస్యల వలయం నుండి బయటపడి సంతృప్తిగా జీవించాలంటే మళ్ళీ తన సాంస్కృతిక మూలాలను వెతికిపట్టుకోక తప్పదు. భిన్న సంస్కృతులకు నిలయమైన భారతదేశం వైవిధ్యాన్ని కాపాడుకున్నప్పుడే సుఖసంతోషాలతో వర్ధిల్లగలుగుతుంది.

భాషాశైలులు, పండుగలు జరుపుకోవడం, వస్త్రధారణ, ఆహారం, ఇళ్ళనిర్మాణం, పంటలు, చదువు, గృహాలంకరణ, సాహిత్యం, కళలు, ఆటలు, సంగీతం మొదలైన అనేక అంశాలలో మన దేశంలో వైవిధ్యం కనిపిస్తుంటుంది. ప్రాంతాలనుబట్టీ పట్టణ, గ్రామీణ, కొండప్రాంతాల సంస్కృతి, ఆచారవ్యవహారాలు భిన్నభిన్నంగా ఉంటాయి. ఉదాహరణకు గిరిజనుల్లో వైద్యానికి సంబంధించిన స్థానిక పరిజ్ఞానం అధికంగా ఉంటుంది. స్థానికంగా దొరికే ఔషధమొక్కలతో వారు చేసుకొనే వైద్యం నిరపాయకరం, చౌక కూడా. ఇలాంటి భిన్న సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన మీద ఉంది.

దేశానికి వెన్నెముక రైతు. ఒకప్పుడు వ్యవసాయం దాదాపు స్వయం ఆధారితంగా ఉండేది. ఇంట్లో ఉన్న గొడ్డూ గోదా రైతుకు కావలసిన ఎరువును అందించేవి. సేంద్రియ ఎరువులతోనే పంటలు పండేవి. ఆహార ధాన్యాలు ఆరోగ్యాన్ని ఇచ్చేవిగా ఉండేవి. రసాయనిక ఎరువులు రాగానే పరిస్థితులు మారిపోయాయి. వాటిలోని విషపదార్థాలు– ఆహారధాన్యాలు, ఆకుకూరలు మొదలైన వాటిలోకి ఇంకి మన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. జాతిని రోగగ్రస్తం చేస్తున్నాయి. దిగుబడి లాభసాటిగా ఉండటంకోసం విచక్షణారహితంగా రసాయనిక ఎరువులను వాడుతున్నారు రైతులు. అందువల్ల భూసారం నానాటికీ క్షీణించిపోతోంది. రైతుకు అమ్మలాంటి భూమి నిస్సారంగా తయారై దీనంగా రోదిస్తోంది.

గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా ఇంతకుముందు ప్రతి ఇంటికీ పెరడు ఉండేది. పెరట్లో ఆకుకూరలు, పూలమొక్కలు పెంచేవారు. అపార్టుమెంట్ సంస్కృతి బస్తీలకు కూడా వ్యాపించిన తర్వాత ఇంటికి పెరడు ఉంటుందనే విషయాన్నే ప్రజలు మరిచిపోతున్నారు. పెరడు పిల్లల్లో శ్రమసంస్కృతి పెంచడానికి దోహదపడేది. ఆకుకూరలు, కూరగాయలు స్వయంగా పెంచుకోవడం, అలా పెంచితే వచ్చే ఆనందం, పొదుపు, ప్రతిదానికి మార్కెట్‌మీద ఆధారపడకపోవడం– ఇవన్నీ పెరటితోనే పోయాయంటే అతిశయోక్తి కాదు. 'పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదు'లాంటి సామెతలు కూడా భాషనుంచి కనుమరుగౌతున్నాయి. పెరటితోపాటే, గతంలో ప్రతి

© SCERT not to be republished

ఇంటిముందూ తులసికోట ఉండేది. కొబ్బరి, వేప, కానుగ, బాదం, అరటి, జామ, ఉసిరిలాంటి చెట్లు ఉండేవి. వాటిని ఆశ్రయించుకొని ఎన్నో పక్షులు ఉండేవి. కిలకిలారావాలతో, కువకువలతో అవి మనలను నిద్రలేపేవి. చెట్ల నీడలు పిల్లల ఆటలకు, పెద్దల విశ్రాంతికి నెలవుగా ఉండేవి. వేపచెట్లకు ఉయ్యాలలు వేసుకొని ఊగడం, బాదం కాయలు పగలగొట్టుకొని పప్పులు తినడం, రాత్రిళ్ళు చెట్ల ఆకుల మధ్య నుంచి పడే వెన్నెల కాంతులలో ఆడుకోవడం మొదలైన వాటితో ప్రకృతికి మనిషికి దగ్గరి సంబంధం ఉండేది. ఇపుడు ఇళ్ళల్లో, రహదారుల పక్కన చెట్లు కూలిపోతున్న దృశ్యాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. చెట్ల ఉనికికే భంగం రావడంతో పక్షులన్నీ వలసబాట పట్టాయి. పులిమీద పుట్రలా టవర్లు, సెల్‌ఫోన్లవల్ల వచ్చే రేడియేషన్ ప్రభావం పక్షులకు నిలువనీడలేకుండా చేస్తున్నాయి. ఇంత పెద్ద ప్రపంచంలో చిన్న పిచ్చుకకు కూడా గూడు లేకుండా తరిమేస్తున్నాయి. ఇవేవి పట్టించుకోకుండా కోకిల కూతలను సెల్‌ఫోన్లలో దాచిపెట్టుకుంటూ వన్యప్రాణి ప్రేమికుల్లా సంతృప్తి చెందుతున్నాం. పల్లె సంస్కృతిని ధ్వంసం చేసుకుంటూ ఆధునికనగరాల్లో కార్పోరేట్ పల్లెల్ని సృష్టించుకుని సంబరపడిపోతున్నాం. ఇలా ప్రకృతిని ప్రేమిస్తున్నట్లు సంబరపడి పోతున్నాడు మనిషి.

చెట్లే కనిపించకుండాపోతున్నప్పుడు ఇక వనాల గురించి ఎలా ఆలోచించగలం? వనభోజనాలు ఎలా చేయగలం? ఇంటిల్లిపాదీ పిక్నిక్‌కు వెళ్ళడానికి అవకాశం కల్పిస్తాయి వనభోజనాలు. ఇంట్లో అందరూ పునరుత్తేజం పొందడానికి ఇవి సహకరిస్తాయి. ఇరుగుపొరుగువారితో కలిసి కార్తికమాసంలో వనభోజనాలు, వెన్నెల విహారాలు చేయడం, పెద్దవాళ్ళు వంటలు చేస్తుంటే పిల్లలు తోటల్లోపడి ఆడుకోవడం ఎంత బాగుంటుంది? ఆ అనుభూతులను ఈ తరం, రాబోయేతరాలు కూడా అనుభవించాలి. చిన్నప్పుడు చందమామ, బాలమిత్రలు చదివి ఆ కాల్పనిక జానపద వాతావరణంలో ఆహ్లాదంగా విహరించి వచ్చేవాళ్ళం. ఇప్పుడా పఠనాభిలాష లేదు. అలాంటి విహారాలు లేవు. మన వాతావరణానికి దూరమైన సినిమాలు వీడియోగేమ్స్, కోచింగ్‌ల మధ్య బాల్యం సహజమైన కాల్పనికశక్తిని కోల్పోతూంది.

ప్రకృతితో ముడిపడి ఉన్న మరొక అంశం ఆహారం. ఆహారం బాగుంటేనే ఆరోగ్యం బాగుంటుందనేది మనందరికీ తెలిసిన విషయమే! ఆయుర్వేదశాస్త్ర గ్రంథాలయిన చరకసంహిత, సుశ్రుత సంహిత, అష్టాంగ సంగ్రహం మొదలైన వాటిల్లో ఆహారానికి సంబంధించిన ఎన్నో విషయాలున్నాయి. వంటిల్లు, పరిసరాలు, పాత్రలు, పదార్థాలు ఎలా ఉండాలో వారు వివరంగా చెప్పారు. వాటిని మన పూర్వులు ఆచారాల మాటున దాచిపెట్టి చెప్పారు. 'పరిమళ ద్రవ్యాలు, పుష్పాలు వీటితో ఆహ్లాదకరంగా ఉన్న ప్రదేశంలో స్థిమితంగా కూర్చొని భోజనం చెయ్యాలి' అన్నది మనవారి శాసనం. ఆచారాలను పాటించినంతకాలం 'శతమానం భవతి' లాంటి ఆశీస్సులు ఫలిస్తుండేవి. ఇప్పుడు వందేళ్ళు బతకడం ఓ కల. కొవ్వు, చక్కెర, ఉప్పు ఎక్కువగా ఉన్న తిండి తినడం, శారీరక శ్రమ తగ్గిపోవడం నేటి అలవాట్లైపోయాయి. స్థూలకాయం ఫలితంగా బి.పి., షుగర్, కీళ్ళజబ్బులు, గుండెజబ్బులు, ఎలర్జీల బారిన పడటం సర్వసాధారణమైంది. గతంలో స్థానికంగా దొరికే ధాన్యాలు, పదార్థాలతో ఆహారాన్ని తయారుచేసుకునేవారు. ఇప్పుడేప్రాంతంలో చూసినా ఒకే రకం ఆహారం దర్శనమిస్తోంది. ఋతువులకనుగుణంగా మనవారు తయారుచేసే పిండివంటలు మాయమయ్యాయి. బొబ్బట్లు, పాలకాయలు, కజ్జికాయలు, కుడుములు, ఉండ్రాళ్ళు, చక్కెర పొంగలి, పులగం, (బొరుగులు) జంతికలు, చేగోడీలు, చక్కిలాలు, అరిసెలు, బూరెలు, పేలపిండి, పేలాలు... ఈ పేర్లు కూడా తెలియకుండా పోయాయి. చిప్స్, నూడిల్స్, లేస్‌లు, పిజ్జాలు, బర్గర్‌లు పిల్లల నోళ్ళలో నానుతూ అనారోగ్యాలకు బాటలు వేస్తున్నాయి. దంతక్షయానికి చాక్లెట్లు రాచబాటలు వేస్తున్నాయి. టెక్నాలజీ పెరిగి యంత్రవినియోగం విస్తారంగా ఉంటోంది. దీన్నెవరూ కాదనరు. కానీ అతి సుఖానికి అలవాటుపడ్డ

మన శరీరం మనల్ని ఎంతవరకు సుఖంగా ఉండనిస్తోందో కూడా ఆలోచించుకోవాలి. యంత్రాలకు బానిస అయిన మనిషి తొందరగా జబ్బులబారిన పడటం మనం ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం. బొగ్గుల కుంపట్లు, రుబ్బురోళ్ళు, రాచిప్పలు, తిరగళ్ళు, కంచుపాత్రలు, గురుగులు, అటికెలు, సర్వలు, కుండలు కనుమరుగై కుక్కర్‌లు, ఓవెన్‌లు, మిక్సీలు, గ్రైండర్‌లు, ఫ్రిజ్‌లు వచ్చిచేరాయి. ఇవి ఏ మేరకు మనను ఆరోగ్యంగా ఉంచుతున్నాయో ఆలోచించాలి.

భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్న నేటి రోజులలో వంటచేయడం ఒక కళ అనడం హాస్యాస్పదమైపోయింది. అంత తీరికెక్కడుందండీ తిని కూర్చోడానికి అనేవారే ఎక్కువయ్యారు. నిజమే! కానీ ఇంటి భోజన సౌఖ్యం ఎలా ఉంటుందో పిల్లలకు రుచిచూపించాల్సిన బాధ్యత కూడా మనదే కాదా! ఆప్యాయంగా వడ్డించడం అనే అపురూప దృశ్యాన్ని మనం ఈ మధ్య చూడగలుగుతున్నామా? తిరగమోతల ఘుమఘుమలు, పచ్చడి నూరేటప్పుడు వచ్చే కమ్మటి వాసనలు పీల్చడానికి కూడా సమయం దొరకడంలేదు. పైగా ఎక్కడ చూసినా కర్రీపాయింట్లే! మన జిహ్వాచాపల్యాల్ని రెచ్చగొట్టి అనారోగ్యాలపాలు చేసే వర్రీపాయింట్లు అయిపోతున్నాయి.

వండటం ఎంత ముఖ్యమో వడ్డించడం అంతకంటే ముఖ్యం. చిన్నతనంలో అమ్మ పిల్లలందర్నీ కూర్చోబెట్టి పప్పు, చారు, పెరుగన్నాలు ముద్దలుచేసిపెట్టడం, వాటిలోనే మరపురాని కథలను మేళవించడం ఎవరూ మర్చిపోలేని విషయం. టివిలో కుట్రపూరిత సీరియళ్ళో, నేరాలు ఎలా జరిగాయనే వార్తలు చూపే సాకుతో మళ్ళీ చిత్రీకరించి ప్రసారంచేసే నేర ప్రేరేపిత ఘోరకథనాలో, డిస్కవరీలోని జంతుహింసనో చూస్తూ అన్నం తినేవారు ఇలాంటి అనుభూతులకు దూరమైనట్లే కదా! ఇక పెళ్ళిళ్ళలో పంక్తి (బంతి) – భోజనాలలో ఉండే హడావుడి, ఆనందం చెప్పనలవిగాదు. కొసరికొసరి వడ్డించేవారు, వరస అయినవాళ్ళను ఆటపట్టిస్తూ ఎక్కువగా వడ్డించేవారు, పరామర్శిస్తూ అటూ ఇటూ తిరిగేవారు, నేతిచెంబులవాళ్ళు, వడ్డించేవాళ్ళకు సలహాలిచ్చేవాళ్ళు– అదంతా ఓ ఆత్మీయ రసార్ద్ర సన్నివేశం. ప్లేట్లకోసం, సీట్లకోసం ఎదురుచూస్తూ, ఏదో అయిందనిపించే నిలువు కాళ్ల బఫే కన్నా పంక్తి భోజనాలు బాగుండవంటారా?

ఆహారం సరిగా లేకపోతే ఆరోగ్యం సరిగా ఉండదని తెలుసుకదా! పూర్వం అనారోగ్యానికి చాలావరకు ఆహారమే ఔషధంగా ఉండేది. జ్వరం వస్తే పునఃపాకం చేసిన అన్నం, మిరియాలచారు, పాతచింతకాయపచ్చడి ఇలాంటివి పెట్టేవారు. పైత్యంతో బాధపడేవాడికి అల్లం ఎంతో హాయినిచ్చేది. ఆహారానికి లొంగని రోగం వచ్చినా అది వైద్యుడి ఆత్మీయతాస్పర్శతోనే సగం తగ్గిపోయేది. మనసులోమాట చెప్పుకుంటే సగం ఊరట లభించేది.

విదేశీసంస్కృతిని మనం గుడ్డిగా అనుసరిస్తున్నామనడానికి మరొక ఉదాహరణ వస్త్రధారణ. శీతలప్రాంతవాసులకు అనుకూలమైన 'జీన్స్'ను స్త్రీ పురుషభేదంలేకుండా ఉష్ణప్రాంతవాసులమైన మనం ధరిస్తున్నాం. అసౌకర్యాన్ని, చర్మరోగాల్ని కొనితెచ్చుకుంటున్నాం.

వాతావరణానికి, ఆయాభౌగోళిక స్థితిగతుల కనుగుణంగా ఇళ్ళు నిర్మించటంలోనూ తేడా వచ్చింది. పెంకుటిళ్ళు, చుట్టుగుడిసెలు లాంటివి మాయమై కాంక్రీటు భవనాలే సర్వేసర్వత్రా దర్శనమిస్తున్నాయి.

ఇప్పుడున్నన్ని రవాణా సౌకర్యాలు, టెక్నాలజీ ఇదివరకు లేవు. అయినా ఏ పండగకో పబ్బానికో కలిసినప్పుడయినా మనసు విప్పి మాట్లాడుకునేవారు. కలిసిమెలిసి పనిపాటల్లో పాల్గొనేవారు. ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉండేవారు. పెళ్ళి పత్రికలలోని ఆహ్వానానికి తగ్గట్టు సకుటుంబ సపరివార సమేతంగా వివాహాది కార్యక్రమాలకు వెళ్ళి యజమాని కష్టసుఖాలు కనుక్కొని అది తమ ఇంట్లో కార్యమే అన్నట్లుగా ఆ పని చక్కబెట్టి వచ్చేవారు. ఇప్పటి పిలుపులు ఫోన్లలోనే పూర్తయిపోతున్నాయి. జరిగే కార్యక్రమం గంటా రెండు గంటల్లో

©SCERT not to be republished

పరిసమాప్తం. ఆహ్వానిత కుటుంబం నుంచి హాజరు శాతం ఒకటీ అరా! అదేమంటే పిల్లవాడికి పరీక్షలు, పిల్లలకు కోచింగ్ క్లాసులు... ఇలా కారణాలు అనేకం. మొత్తంమీద కార్యక్రమాలు చాలావరకు మొక్కుబడిగానే ముగిసిపోతున్నాయి. కదూ!

జీవితం ఓ పరుగుపందెమే! కాదనలేం. కానీ ఈ ఉరుకులపరుగుల జీవితం లక్ష్యం ఏమిటి? సుఖంగా ఉండటం కాదా? దాన్ని మనం ఎంతవరకు అనుభవిస్తున్నాం? మన మనసులో మాట తీరిగ్గా ఒకరితో చెప్పుకోగలుగుతున్నామా? పూర్వం వీధి అరుగులు, గుడి ప్రాంగణాలు, రచ్చబండలు మొదలైన ప్రదేశాల్లో కలిసిన ప్రజలు, వారికున్న ఆనందాలు, సుఖాలు, దుఃఖాలు, ఈర్ష్యలు, అసూయలు, ద్వేషాలు అన్నీ తమ ఆత్మీయులతో పంచుకునేవారు. హృదయభారాన్ని దించుకొని తేలికపడ్డ మనసుతో ఇళ్ళకు వెళ్ళేవారు. ఇప్పుడలా చెప్పుకునే మనుషుల్లేక తమలో తామే కుమిలిపోతున్నారు. ఇదంతా చూస్తుంటే మన సుఖం మేడిపండు చందంగా కనిపించడంలేదూ!

వైవిధ్యంలేని మన బతుకులకు మరో ఉదాహరణ- మనల్ని ముంచెత్తుతున్న ప్లాస్టిక్ భూతం. శ్రీశ్రీ 'యంత్రభూతముల కోరలు తోమే కార్మిక ధీరుల కన్నుల నిండా కణకణ మండే గలగల తొణకే విలాపాగ్నులకు విషాదాశ్రులకు ఖరీదుకట్టే షరాబు లే' దంటూ కార్మికులు యంత్రాలకు ఎలా బానిసలయ్యారు? ఆ యంత్రాలు ఎలా ధనిక స్వాములచేతుల్లో ఉన్నాయో వివరించాడు. ఇప్పుడు పేద, ధనిక తేడా లేకుండా సర్వప్రజానీకం ప్లాస్టిక్ భూతానికి దాస్యంచేస్తూ అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారు. గుమ్మానికి వేళ్ళాడే మామిడాకులు వాకిళ్ళలో ప్లాస్టిక్ ముగ్గులు మొదలుకుని చేతిలో క్యారీబ్యాగ్ వరకు అన్నీ ప్లాస్టిక్ మయాలే! గతంలో మనకు మట్టి పాత్రల వాడకం ఎక్కువగా ఉండేది. అవి పగిలిపోయినా వెంటనే మట్టిలో కలిసిపోయి ప్రకృతికి హాని కలిగేది కాదు. ప్లాస్టిక్ వినియోగం ఎక్కువైన తర్వాత వాడి పడేసే అలవాటు పెరిగింది. పర్యావరణపరంగా ఇది చేస్తున్న హాని మనందరికీ తెలిసిందే! భూమిలో కరగకుండా ఎన్నోవేల ఏళ్లు అలాగే పడి ఉండి వరదలకు కారణమవుతూ, సముద్రజీవులకు ఇది చేసే నష్టం అపారం. మన సంప్రదాయంలో సాంస్కృతిక భిన్నత్వం కనపడకుండా చేయడంలో దీని పాత్ర గణనీయమైనదే! దేవుడి మెడలో పరిమళాలను వెదజల్లే పూలదండ స్థానాన్ని ప్లాస్టిక్ పూలదండ భర్తీ చేయలేదు కదా! కల్యాణమంటపాల అలంకరణ, స్వాగత తోరణాలు ఇలాంటివన్నీ ఈ కోవలోకే వస్తాయి. పూర్వం ఏదన్నా కార్యక్రమానికి హాజరైతే అది పెళ్ళో, చావో, ఇంకోటో, ఇంకోటో స్పష్టంగా తెలిసేది. పెళ్ళి పందిళ్ళలో కళ వేరు. శ్రీరామనవమి పందిళ్ళ కళ వేరు. వినాయక చవితి అలంకరణలు వేరు. ఇప్పుడు ఏ పందిరి చూసినా ఏమున్నది గర్వకారణం, ప్రతి పందిరీ షామియానాలు, ప్లాస్టిక్ కుర్చీల మయం అనుకోవాల్సి వస్తోంది.

చిట్టచివరకు భాషలో కూడా మనం మన సహజత్వాన్ని కోల్పోతున్నాం. విదేశీభాషా జీవన వ్యామోహాలకు ప్రభావితమైన ప్రచార, ప్రసార సాధనాలు మన మాతృభాషను శాసించే స్థాయికి ఎదిగాయి. పాశ్చాత్యదేశాలకు వలసబాట పట్టి తిరిగొచ్చిన యువతరం వల్ల కూడా భాషలో పెనుమార్పులు వస్తున్నాయి. అటు ఇంగ్లీష్‌కాని, ఇటు తెలుగుకాని ఓ కృత్రిమ భాషా సృష్టికర్తలవుతున్నారు వారు. ఇప్పటివరకూ పదస్థాయిలో మాత్రమే ఉన్న ఆంగ్ల ప్రభావం మెల్లమెల్లగా వాక్యనిర్మాణంలోకి కూడా చొరబడుతోంది. తెలుగుభాషకొచ్చిన పెనుప్రమాదం ఏమీ లేదని చాలామంది భాషాశాస్త్రవేత్తలు నిబ్బరాన్ని ప్రదర్శిస్తున్నారు. కానీ ఇది చాపకింది నీరు అనే విషయాన్ని మనం గుర్తెరగాలి. జాతీయాలు, పలుకుబడులు, నానుడులు, సామెతలు, నుడికారాలు వంటివి మన భాషాసంపద. వీటిలో కొన్ని పాతబడి పనికిరాక అదృశ్యమైపోయినా కొత్తవాటిని సృష్టించుకుంటూ భాషను పరిపుష్టం చేసుకోవాల్సిన

బాధ్యత మనందరిమీద ఉంది. ఉచ్చారణ, లేఖన విషయాల్లో కుర్రకారుకు ఆదర్శప్రాయంగా ఉండాల్సిన పెద్దవారే ఈ విషయంలో తమ అసహాయతను బాహాటంగా ప్రకటించడం తగదు. 'నాకు తెలుగు అంతగా రాదు' అని గర్వంగా చెప్పుకునే దశ నుంచి, సిగ్గుపడుతూ చెప్పుకునే దశవరకూ మనం ఎదగాల్సిన అవసరం ఉంది. దానికి ప్రవాసాంధ్రులు కొంతలో కొంత మనకు ఆదర్శప్రాయులనడం అసత్యంకాదు. ఒకప్పటి మన సంస్కృతీ సంప్రదాయాలను వారు రక్షించుకుంటున్నట్లు మనం రక్షించుకోలేకపోతున్నామనేది ముమ్మాటికీ నిజం.

ఇన్ని సమస్యలకు మూల కారణం ఏమిటి? ఎంతో వైవిధ్యం కలిగిన జాతి ఎందుకింత యాంత్రిక జీవితాన్ని గడుపుతోంది? అంటే దీని మూలకారణాలు వ్యాపార సంస్కృతిలో దాగి ఉన్నాయని మేధావులు చెబుతున్నారు. దీన్ని ప్రతి ఇంట్లో పెంచి పోషిస్తూ నరనరానా జీర్ణంచేస్తోంది ప్రసారమాధ్యమాలు. ముఖ్యంగా టివి. దీంట్లో వచ్చే ప్రకటనలు చిన్నా పెద్దా తేడా లేకుండా అందర్నీ దాని మాయాజాలంలోకి లాగేస్తోంది. ప్రకటనలు చూసి బజారుకు వెళ్ళి వస్తువులను కొనుక్కొస్తున్నాం. అవసరంలేనివి కూడా కొనిపించే మాల్స్‌మాయలో పడిపోతున్నాం. ఈ మార్కెట్ సంస్కృతిలో పడి పొదుపుమంత్రాన్ని మర్చిపోతున్నాం. మన మూలాల్ని మనం కాపాడుకుంటూ భావితరాలకు మన సంస్కృతీ సంప్రదాయాల్ని అందించాల్సిన బాధ్యత మనందరిదీ!

అయితే కాలం మారుతోంది. కాలంతోపాటు పరిస్థితులు మారుతున్నాయి. మనుషుల ఆలోచనావిధానం మారుతోంది. ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, జీవనశైలి మారుతున్నాయి. ఇది అనివార్యం. అనుసరణీయం కూడా. అందుకే 'మారక తీరనిదీ లోకం' అంటాడు బైరాగి అనే కవి. కానీ ఈ మార్పు మన శారీరక, మానసిక వికాసానికి అనుకూలంగా ఉండాలి. అప్పుడే అది ఆచరణీయం, అనుసరణీయం అవుతుంది.

అన్ని మార్పులూ మంచికే అని బల్లగుద్ది చెప్పలేం. వెల్లువలా వస్తున్న ఒక సంస్కృతి ప్రభావానికి లోనైగాని, పాలకుల ప్రభావానికి లోనైగాని సమాజంలో కొన్ని మార్పులు జరుగుతుంటాయి. పరాయి సంస్కృతీ సంప్రదాయాలను గుడ్డిగా అనుసరించడంవల్ల వచ్చే నష్టాలు చాపకింద నీరులాంటివి. కొంపమునిగిన తర్వాతగానీ వాటివల్ల వచ్చే నష్టాలు కంటికి కనిపించవు. అందువల్ల చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు కాకుండా కొన్ని విషయాలలో ముందే మేల్కొనే ప్రయత్నం చేద్దాం!

**కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

(1) సాంస్కృతిక జీవనంలో పెరటికున్న ప్రాధాన్యత ఏమిటి?


(2) పూర్వకాలం మరియు ఈనాటి ఆహారపు అలవాట్లలో తేడాలెందుకు? చర్చించండి.

(3) "ప్లాస్టిక్" వినియోగాలవల్ల వచ్చే ప్రమాదాలేంటి?

(4) నేటి మనిషి అనారోగ్యం పాలవటానికి ఆహార పదార్థాలే కారణం. ఎందుకని?

© SCERT not to be republished

# హైదరాబాద్ సంస్థాన విమోచనోద్యమం



1939 ఫిబ్రవరి7. సాయంత్రమైంది. హైదరాబాద్ జైలులో నిజాంపోలీసులు మూడో నెంబర్ వార్డులోకి ఒక యువకుణ్ణి పట్టితెచ్చారు. అక్కడొక ముక్కాలిపీట వంటిది ఉన్నది. శిక్షను అమలుచేసే పీట అది. వాళ్ళభాషలో దాన్ని 'టిక్‌టికీ' అంటారు. యువకుణ్ణి ఆ పీటపై నిలబెట్టారు. చేతులు, కాళ్ళు కట్టేశారు. ముందర ఒక బలిష్ఠమైన మనిషి నిలబడివున్నాడు. అతడు కరడుగట్టిన నేరస్థుడు. పేరు దావూద్.

జైలు సూపరింటెండెంట్ సైగచేయడమే ఆలస్యం దావూద్ ఆ యువకుడిపై విరుచుకుపడ్డాడు. బలమైన కట్టెతో కొట్టడం ప్రారంభించాడు. మొదటి దెబ్బ పడింది. ఆ యువకుని నోటివెంట 'వందేమాతరం' అన్న నినాదం సింహనాదంలా వెలువడింది. దెబ్బమీద దెబ్బ. చివుక్కున రక్తం చిందింది. కొట్టే దెబ్బలకు ఆ ధీరుడి శరీరం నుండి రక్తం ఆగడంలేదు- అతని కంఠం నుండి 'వందేమాతరం' ఆగడంలేదు. దెబ్బదెబ్బకు 'వందేమాతరం' అని గొంతెత్తి అరుస్తున్నాడు. అతని ఆవేశపూరితమైన 'వందేమాతరం' ఆ గదంతా మార్మోగుతున్నది. దావూద్ దెబ్బకు ఎదురుదెబ్బలా వుందది. మరింత ఆవేశంతో రెచ్చిపోయాడు దావూద్. విచక్షణారహితంగా కొడుతున్నాడు. ఆ యువకుడు స్పృహ తప్పుతున్నాడు. అయినా చివరి నిముషం వరకు 'వందేమాతరా'న్ని మాత్రం వదలలేదు. దేహభక్తిని మించిన దేశభక్తి అది.

నిజాం ఆదేశాలను తృణప్రాయంగా భావించి వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్న ఆ యువకుడే రామచందర్‌రావు. అతని సడలనిస్థైర్యానికి గుర్తుగా 'వందేమాతరం రామచందర్‌రావు'గా కీర్తింపబడ్డాడు. 'వందేమాతరం' అతని ఇంటిపేరైంది. దేశచరిత్రలో ఇది అపూర్వసన్నివేశం. హైదరాబాద్ సంస్థాన విమోచనోద్యమంలో ఇలా గగుర్పాటు కలిగించే సంఘటనలెన్నో.

భారతస్వాతంత్ర్యసంగ్రామచరిత్రలో హైదరాబాద్ సంస్థానవిమోచనోద్యమం ప్రత్యేకతను సంతరించుకున్నది. బ్రిటిష్‌వారి నుండి 1947,ఆగష్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది. కాని హైదరాబాద్ సంస్థానపు నిజాంరాజు మాత్రం తాను ఇండియన్‌యూనియన్‌లో కలవనని, స్వతంత్రంగా ఉంటానన్నాడు. దేశమంతా ఆనందంగా పండుగ జరుపుకునే వేళ ఇక్కడి ప్రజలు ఇంకా బానిసబంధాలతో బాధపడుతూనే ఉన్నారు. విముక్తికై మరో పదమూడు నెలల ఉత్కంఠభరితమైన పోరాటం చేయవలసి వచ్చింది వీరికి. అసలు ఎవరీ నిజాం? ఏమిటా కథా? తెలుసుకోవాలనుంది కదూ!

మన దేశంలోని పెద్దసంస్థానాలలో హైదరాబాద్ సంస్థానం ఒకటి. దీన్ని 'హైదరాబాద్ స్టేట్' అన్నారు. దీని పాలకులు అసఫ్‌జా వంశీకులైన నిజాంరాజులు. అందుకే దీనికి 'నైజాంసంస్థానమ'ని మరో పేరు. వీరి పూర్వీకులు టర్కీ దేశంనుండి భారతదేశానికి వచ్చి షాజహాన్ చక్రవర్తి వద్ద చేరారు. 1724 నుండి నిజాం రాజుల పరిపాలన ఇక్కడ ప్రారంభమయింది. నైజాం సంస్థానంలో తెలంగాణప్రాంతం, కర్నాటక, మహారాష్ట్ర లోని కొన్ని ప్రాంతాలుండేవి.

© SCERT not to be republished

ఏడవనిజాం మీర్ ఉస్మానలీఖాన్ 1911లో రాజుగా బాధ్యతలను చేపట్టాడు. ఇతని పరిపాలన ఈ ప్రాంత ప్రజలకొక పీడకలలా పరిణమించింది. ప్రజల ధన, మాన, ప్రాణాలకు ముప్పువాటిల్లింది. సంస్కృతీ సంప్రదాయాలపై ఉక్కుపాదం మోపబడింది. ఇతర మతస్థుల వేష, భాషలు అనాదరణకు గురైనాయి. బలవంతంగా మతమార్పిడులు జరిగాయి. ఈ అణచివేతను,దమనకాండను భరించలేని ప్రజలు ఎదురు తిరిగారు. సమర్థులైన నాయకుల వెన్నంటి నడిచారు. నిజాంను గద్దిదింపడమే వీరి ఏకైక లక్ష్యం.

* * *

దేశంలో జరుగుతున్న జాతీయోద్యమ ప్రభావం నిజాం విమోచనోద్యమానికి ఊతమిచ్చింది. జాతీయ నాయకుల ప్రేరణతో ఇక్కడ పలు ఉద్యమాలు నడిచాయి. 'వందేమాతరం' 'క్విట్ ఇండియా' వంటి ఉద్యమాల తీవ్రత ఇక్కడ కూడా దర్శనమిచ్చింది.

'ఆంధ్ర జనసంఘం' అవతరణతో హైదరాబాద్ సంస్థానంలో సాంఘిక, రాజకీయ, ఆర్థిక ఉద్యమాలకు అంకురార్పణ జరిగింది. సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, మందుముల నర్సింగరావు వంటి మహానుభావుల ఆధ్వర్యంలో ఈ సంస్థ ఉద్యమించింది. వెట్టిచాకిరి నిర్మూలనకు నడుంకట్టింది. తరువాతి కాలంలో ఈ సంస్థయే 'నిజాంరాష్ట్ర ఆంధ్రమహాసభ'గా రూపమెత్తింది. ప్రజలలో చైతన్యం కలిగించే కార్యక్రమాలెన్నింటినో చేపట్టింది.

1938 జనవరి 9న 'హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్' పురుడుబోసుకున్నది. పరిపాలన వ్యవహారాల్లో ప్రజలకు ప్రమేయం ఉండాలని వాదించింది. పత్రికా స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛ ఉండి తీరాల్సిందేనని పట్టుబట్టింది. మతవివక్ష ఉండరాదని తేల్చి చెప్పింది. అందరికీ సమానహక్కులు ఉండాల్సిందేనని తీర్మానించింది. ఇదంతా నిజాం జీర్ణించుకోలేకపోయాడు. ఫలితంగా ఈ సంస్థను నిషేధించాడు.

అది 1940 సం॥ మహారాష్ట్రలోని సేవాగ్రాంలో గాంధీజీ కుటీరం ముందుభాగంలో కొందరు కూర్చుని వున్నారు. హైదరాబాద్‌స్టేట్ కాంగ్రెస్ నిషేధం గురించే బాపూజీతో చర్చిస్తున్నారు. అందరి అభిప్రాయాలను విన్నాడు బాపూజీ. చివరిగా తన నిర్ణయాన్ని ప్రకటించాడు. హైదరాబాద్‌స్టేట్ కాంగ్రెస్ సజీవంగా ఉన్నదని నిరూపించడానికి పోరాటాన్ని తిరిగి ప్రారంభించాలన్నాడు. కాని ఈ పోరాటాన్ని ఆషామాషీగా తీసుకోకుండా చావో రేవో తేల్చుకునే విధంగా సాగించమన్నాడు. ఈ ఉద్యమంలో తలలు తెగిపడవచ్చు, ఉరిశిక్షలు, తుపాకి గుండ్లకు బలికావలసి రావచ్చునన్నాడు. అవసరమైతే ప్రాణత్యాగానికి కూడా వెనకాడకూడదని కుండబద్దలు కొట్టినట్లు చెప్పేశాడు "మీ విషయంలో ప్రభుత్వంతో రాయబారాలు జరుపను. మీరు ఆత్మాహుతికి సిద్ధంగా ఉంటే చెప్పండి అనుమతిస్తా"నన్నాడు.

రాత్రంతా ఆలోచించారు. ఒక ధీరుడు సాహసంతో, కృతనిశ్చయంతో ముందుకు వచ్చాడు. అతడే స్వామి రామానందతీర్థ. బాపూజీ అనుమతితో "వ్యక్తిసత్యాగ్రహం" చేసి అరెస్టయినాడు. నిజామాబాద్ జైలులో నిర్బంధింపబడ్డాడు. సమాజహితంకోసం సర్వస్వాన్ని సమర్పించడానికి సన్నద్ధమైన సాహసి అతడు, 'Shall Break But Shall not Bend' అని నినదించాడు. అతని ధైర్యసాహసాలు ఎందరికో ప్రేరణనిచ్చాయి. నిజాం విమోచనోద్యమంలో చురుకైనపాత్ర పోషించినవారు స్వామీజీ. అంతగా కృషిచేసినా వారికి అహంకారంలేదు. పైగా 'నీవు లేనిదే ఏదీ జరగదనుకోకు. సమయానుకూలంగా, నీ పాత్రను నీవు నిర్వహించాలి. కేవలం నీవు

నిమిత్తమాత్రుడవేనని భావించాలన్నాడు. ఉత్తముల జీవితం ఇలా ఒజ్జబంతియై వెలుగుతుంటుంది.

సత్యాగ్రహంచేసి అరెస్టయినవారిలో గోవిందరావు నానల్, రామకిషన్‌ధూత్, రావి నారాయణరెడ్డి, జనార్ధన్‌రావు దేశాయ్, సర్దార్ జమలాపురం కేశవరావు, బద్దం ఎల్లారెడ్డి, ఎన్.కె.రావు, కాళోజీ వంటి ప్రముఖులున్నారు. బూర్గుల రామకృష్ణారావుగారి చతురత, సర్దార్ జమలాపురంకేశవరావుగారి సాహసం ఉద్యమ తీవ్రతను పెంచాయి.

వీరితోబాటు ఆర్యసమాజ్, హిందూపరిషత్‌లు కూడా సత్యాగ్రహ కార్యక్రమాలను చేపట్టాయి. ఆర్యసమాజం సంఘంలోని దురాచారాలను, సంకుచిత స్వభావాలను దూరంచేసి, కుల, శాఖ, భేదాలను తొలగించి సమాజాన్ని సంఘటితం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగింది. ఆత్మాభిమానాన్ని ప్రేరేపిస్తూ స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలను భాగస్వాములను చేసే ప్రయత్నం చేసింది. ఈ ఉద్యమంలో పండిత నరేంద్రజీ ఆవేశపూరిత ప్రసంగాలు ప్రజలలో నవచైతన్యాన్ని కలిగించాయి. వీరు మహావక్త. వీరి ఉద్యమ, ప్రసంగ తీవ్రతను గమనించిన నిజాం వీరికి 'కాలాపానీ శిక్ష' వేశారు. మహబూబ్‌నగర్ జిల్లా మన్ననూరు అడవుల్లో ఉండే జైలుశిక్షను 'కాలాపాని శిక్ష' అనేవారు. అక్కడి వాతావరణం దుర్భరంగా ఉండేది. బ్రిటీషువారు కఠినశిక్ష కోసం అండమాన్ దీవులకు పంపినట్లు నిజాం హయాంలో 'కాలాపానీ శిక్ష' వుండేది.

నిజాం సంస్థానంలోని భూస్వాముల దోపిడికి వ్యతిరేకంగా రైతుకూలీలను ఏకంచేసి పోరాటంచేయడంలో కమ్యూనిష్టులు ప్రముఖపాత్ర వహించారు.

నిజాం విమోచనోద్యమంలో భాగంగా 'గ్రంథాలయోద్యమం' ప్రారంభమైంది. ప్రజలను చైతన్యవంతులనుచేసే విజ్ఞానోద్యమంగా సాగింది. 1901లో హైదరాబాద్‌లో 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం' స్థాపించబడింది. 1904లో హన్మకొండలో 'రాజరాజనరేంద్రాంధ్రభాషానిలయం' స్థాపించబడింది. 1905లో సికిందరాబాద్‌లో 'ఆంధ్రసంవర్ధినీ గ్రంథాలయ' స్థాపన జరిగింది. గాడిచర్లహరిసర్వోత్తమరావు, కొమర్రాజు లక్ష్మణరావు, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, కోదాటి నారాయణరావు, ఆదిరాజు వీరభద్రరావు ప్రభృతులు ఇందులో కీలకపాత్ర పోషించారు. ఊరూరా గ్రంథాలయాలను స్థాపించి ప్రజలను సామాజిక విషయాలపై చైతన్యవంతులుగా చేయడమే లక్ష్యంగా ఈ ఉద్యమం కొనసాగింది. దీనివల్ల తన పీఠానికి ముప్పు వస్తుందని గ్రహించిన నిజాంరాజు దీనిపై కూడా ఆంక్షలను విధించాడు.

నిజాంరాజుకు బ్రిటీషు చక్రవర్తిలా తనూ మెప్పుపొందాలన్న బలమైన కోరిక ఉండేది. 'దేవుడు రాజును రక్షించుగాక' అన్న గీతం బ్రిటీషు పాఠశాలలో ఆనాడు విధిగా పాడించేవారు. అది చూచి నిజాం స్వయంగా గీతం రాసుకున్నాడు. "ప్రపంచ సృష్టికర్త నీ రాజ్యాన్ని ప్రళయం వరకు ఉంచనీ, ఓ ఉస్మాన్, నిన్ను నిండుదర్పంతో క్షేమంగా ఉంచనీ" అని దీని అర్థం. ఈ గీతంలో కొన్ని చరణాలున్నాయి. దీనిని అన్ని విద్యాలయాల్లో విధిగా ఆలపించాలనే హుకుం జారీచేశాడు నిజాంరాజు. స్వాతంత్ర్యోద్యమ ప్రభావం బలంగా సాగుతున్న కాలం అది. విద్యార్థులు ఆ గీతానికి బదులు 'వందేమాతరం' పాడటం మొదలుపెట్టారు. నిజాం ఆగ్రహోదగ్రుడైనాడు. వందేమాతరం పాడకూడదని నిషేధాజ్ఞలు జారీచేశాడు. అయినా విద్యార్థులు లెక్కచేయలేదు. ఫలితంగా వందలాది విద్యార్థులను విద్యాలయాల నుండి తొలగించాడు. దీనితో నిజాంరాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఇది జాతీయనాయకుల దృష్టిని ఆకర్షించింది.



© SCERT not to be republished

నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 'మీరు లొంగవలసిన పనిలేదు. మీ ఉద్యమం న్యాయమైంది. వందేమాతరం ఒక మంత్రం వంటిదని వెన్నుతట్టాడు. గాంధీజీ 'వందేమాతరం ప్రార్థన చేసుకునే హక్కు ప్రతి భారతీయుడికి వున్నది. దాన్ని కాదనేవారెవరూలే'రని ధైర్యమిచ్చాడు. నెహ్రూజీ స్పందిస్తూ ఈ ఉద్యమానికి తన సహకారం తప్పక లభిస్తుందన్నాడు.

ఇక్కడి వీరులు తమసేవలను కేవలం ఈ ప్రాంతానికే పరిమితం చేయలేదు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు సన్నిహితులై, వారి 'ఆజాద్ హింద్ రేడియో'లో పని చేసిన డాక్టర్ సురేశ్‌చంద్ర హైదరాబాద్‌వాసి. నేతాజీ రాసిన ప్రసంగాలను చదవడమేగాక, తానూ రాసేవాడు. హైదరాబాద్‌కే చెందిన అబిద్ హుసేన్ సఫ్రానీ నేతాజీకి వ్యక్తిగత కార్యదర్శి. ఖుర్రమ్ ఇస్లాం, అడివయ్య, రామస్వామి, నర్సయ్య వంటి వారెందరో 'ఆజాద్ హింద్‌ఫౌజ్'లో చేరి దేశమాతను సమర్చించారు.

హైదరాబాద్‌సంస్థాన స్వాతంత్ర్యోద్యమంలో ప్రత్యేకాకర్షణగా నిలిచింది 'భాగ్యనగర్ రేడియో.' ఇది రహస్యరేడియో కేంద్రం. నిజాంప్రభుత్వ రేడియో పేరు 'దక్కన్ రేడియో.' ఇందులో ప్రసారమయ్యే విషయాలలోని నిజానిజాలను నిగ్గుదేలుస్తూ భాగ్యనగర్ రేడియో ప్రసారాలు చేసేది. ప్రతిరోజు సాయంత్రం ప్రసారాలు జరిగేవి. ఉద్యమపరిస్థితులను ఎప్పటికప్పుడు వివరించేది. రజాకార్లు, నిజాంపోలీసులు ప్రజలపై జరుపుతున్న అత్యాచారాలను, దోపిడీలను, దుర్మార్గాలను బట్టబయలు చేసేది. ప్రజలకు దిశానిర్దేశంచేసేది. కర్నూలు శిబిర ప్రధాన కార్యనిర్వహణాధికారి పాగ పుల్లారెడ్డి నేతృత్వంలో ఈ రేడియో కేంద్రం నడిచింది. గడియారం రామకృష్ణశర్మ, గొట్టిముక్కుల కృష్ణమూర్తి, కమతం వెంకటరెడ్డి, వకీలు నాగప్పలు ఈ రేడియో నిర్వహణలో ప్రధాన పాత్ర పోషించారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషుభాషలలో వార్తలను ప్రసారంచేసేవారు. గడియారంవారి ఆవేశపూరిత ప్రసంగాలు శ్రోతలకు ఉత్తేజాన్ని కలిగించేవి. ఉద్యమానికి వారిని సమాయత్తంచేసేవి. ఈ రేడియో తీవ్రత తెలుసుకున్న నిజాం పబ్లిక్ రేడియోలను బంద్‌చేయించాడు. అయినా ప్రజలు ఇండ్లలో వినేవారు. ఈ రహస్యరేడియో కేంద్రం ఆచూకీని కనిపెట్టాలని నిజాం శతవిధాల ప్రయత్నించాడు. కాని ఆయన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. చివరివరకు కనిపెట్టలేకపోయాడు. భారత స్వాతంత్ర్యోద్యమంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ బెర్లిన్ నుండి నడిపిన 'ఆజాద్‌హింద్ రేడియో' ఎంత చారిత్రాత్మకమో, 'భాగ్యనగర్ రేడియో' కూడా అంతటి ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఇదొక సాహసోపేతమైన చర్య.

నిజాం ప్రభుత్వ భావాలకు వ్యతిరేకంగా షోయబుల్లాఖాన్ అనే యువకుడు తన 'ఇమ్రోజ్' పత్రికలో వార్త ప్రచురించాడు. ఇది చూసి ఒంటికాలుమీద లేచాడు ఖాసీంరజ్వీ. ఇతడు 'రజాకార్ దళ్' నాయకుడు. ఇదొక సాయుధ దళం. నిజాం ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసేది. వ్యతిరేకించేవారిపై దాడులకు పూనుకునేది. హత్యలకు, గృహదహనాలకు, దోపిడీలకు, మానభంగాలకు, అరాచకాలకు ఇది పెట్టింది పేరు. రజాకార్ల పేరు వింటేనే గ్రామాల్లో గడగడ వణకేవారు. అంతటి భయానక వాతావరణం. ఖాసీంరజ్వీ ఆదేశంతో రజాకార్లు షోయబుల్లాఖాన్‌ను నట్టనడివీధిలో నరికిచంపారు. అంతటి భీభత్స వాతావరణంలో కూడా తమ పత్రికల ద్వారా ప్రజలలో జాగృతిని కలిగించినవారు సురవరం ప్రతాపరెడ్డి, మందుముల నర్సింగరావు గారలు. సురవరంవారి 'గోల్కొండ పత్రిక', మందుముల వారి ఉర్దూ పత్రిక 'రయ్యత్' చేసిన సేవ ఇంతంతనరానిది. ఇందులో వచ్చే సంపాదకీయాలు, వార్తలు నిజాంకు సింహస్వప్నమయ్యాయి. ప్రజలలో భావవిప్లవానికి ఈ పత్రికలు బాటలు వేశాయి. పత్రికల పరమార్థాన్ని చెప్పకనే చెప్పాయి.

తమ కలం ద్వారా, గళంద్వారా ప్రజలను ఉత్తేజపరిచిన కవిధీరులెందరో వున్నారు. వారిలో దాశరథి కృష్ణమాచార్యులు ప్రముఖంగా పేర్కొనదగినవారు. వీరు నిజామాబాద్‌జైలులో బంధింపబడినపుడు పళ్ల

తోముకోవడానికిచ్చిన బొగ్గుతో ప్రతిఘటన నిప్పురాజేశారు. జైలుగోడలపై నిజాంకు వ్యతిరేకంగా పద్యాలు రాశారు. వట్టికోట ఆళ్వార్‌స్వామి, దాశరథి రంగాచార్య, కాళోజీ నారాయణరావు, సుద్దాల హన్మంతు, యాదగిరి వంటి కలంయోధుల రచనలు కలకలం సృష్టించాయి. కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా జాతీయభావాలను ప్రేరేపించారు. ఉద్యమస్ఫూర్తిని నింపారు. 'సాముహిక గణపతి ఉత్సవాలు' భక్తితో పాటు దేశభక్తిని ప్రకటించే వేదికలైనాయి.

సంస్థానంలో జరిగే అన్యాయాలకు, అక్రమాలకు మూలం నిజాం ప్రభువేనని భావించాడు నారాయణరావు పవార్. అందుకే ఏకంగా నిజాంరాజు పైనే బాంబుదాడికి పూనుకొన్నాడు. ఒక పథకం ప్రకారం దాడిచేశాడు. కాని తృటిలో ప్రమాదం నుంచి బయటపడి నిజాం ప్రభువు బతికి బట్టకట్టాడు. దేశవ్యాప్తంగా ఇది సంచలనం సృష్టించింది. ఫలితంగా పవార్‌కు ఉరిశిక్ష విధించాడు నిజాం. కాని ఇంతలోనే స్వాతంత్ర్యం రావడంతో పవార్ జైలునుండి విడుదలయ్యాడు.

నాయకులే కాదు, సామాన్యులు కూడా ఈ ఉద్యమంలో ఉడతాభక్తిగా సేవలందించారు. నిజామాబాద్ జైలులో క్షురకుడు సుబ్బన్న. ఇతడు సాహసి. రహస్యంగా బయటి సమాచార లేఖలను, పత్రికలను జైలులో నిర్బంధింపబడిన నాయకులకు అందజేసేవాడు. ఇలా ఎవరి శక్తిమేరకు వారు ఈ మహాయజ్ఞంలో పాలుపంచుకున్నారు.

హైదరాబాద్ సంస్థాన విమోచనోద్యమంలో ఇలాంటి సంఘటనలు లెక్కకుమిక్కిలిగా ఉన్నాయి. కేవలం ఇవి మచ్చుకుమాత్రమే. సర్దార్ వల్లభభాయిపటేల్ సాహసోపేత నిర్ణయం 'పోలీసుచర్య' ఇది నిజాం పరిపాలనకు 'భరతవాక్యం' పలికింది. భారతసైన్యం నలుమూలల నుండి నిజాం సైన్యంపై దండెత్తింది. ఆ ధాటికి తట్టుకోలేక నిజాంసైన్యం తోకముడిచింది. నిజాంరాజు లొంగిపోయాడు. 1948 సెప్టెంబరు 17న హైదరాబాద్ రాష్ట్రం స్వతంత్రమైంది. దీనితో భారతస్వాతంత్ర్యోద్యమంలో చివరిఘట్టం పూర్తయి దేశానికి పరిపూర్ణ స్వాతంత్ర్యం లభించినట్లయింది.



అఖండ భారతదేశంలో హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేసిన ఘట్టం

© SCERT not to be republished

**ఆధార గ్రంథాలు - 1. హైదరాబాదు స్వాతంత్రోద్యమ చరిత్ర, - వెల్దుర్తి మాణిక్యరావు**
**2. హైదరాబాదు స్వాతంత్ర్య పోరాటం - అనుభూతులు, జ్ఞాపకాలు - స్వామి రామానంద తీర్థ.**

## I) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. పాఠ్యాంశ సారాంశాన్ని సంక్షిప్తంగా రాయండి.
2. వందేమాతరం రామచందర్‌రావు సంఘటన నుండి మీరేమి గ్రహించారు?
3. ఈ పాఠ్యాంశంవలన మీరేమి ప్రేరణ పొందారు?
4. మనదేశానికి మీరు ఎలా సేవ చేయాలనుకుంటున్నారు?

# మధుపర్కాలు

- రావూరు వేంకట సత్యనారాయణరావు



పుట్టన్నది రెండు నిట్టాళ్ళపాక. అవి నెత్తి మీద నీడకోసం వేసుకున్న నిట్టాళ్ళు, అసలా ఇంటికి నిట్టాళ్ళు ఆ దంపతులే. పుట్టన్నా, సీతమ్మా ఒక్కటే ఎత్తు. భౌతికంగానే కాదు...... ఆత్మలో కూడా సమానమైన ఎత్తులోనే ఉంటారు. ఒకటిగా ఉన్న ఆత్మను రెండుచేసి, రెండింటికి రెండు శరీరాలు కల్పించి, భూలోకంలో కొన్నాళ్ళు ఆడుకురండని ఆ విధాత పంపాడా, అనిపిస్తుంది వారిని చూస్తే.

పుట్టన్న వృత్తి బట్టలనేత. రోజుకు ఏ నాలుగుగంటలో తప్ప, చేతిలో కండెను పడుగులో నుంచి అటూ యిటూ గిరాటువేస్తూ, వస్త్రం నేస్తూనే ఉంటాడు. సీతమ్మ రాట్నం దగ్గరనుంచి లేవదు. వడివడిగా చిలపలు తోడటం, కండెలు చుట్టడం, పడుగు వేసినప్పుడు భర్తతోపాటు గంజిపెట్టడం, కుంచె తీయడం ఆమె విధులు. ఏ సమయంలో కూడా వారు 'కాయకష్టం చేస్తున్నాం' అనే భావాన్ని బయట పెట్టేవారు కాదు. అదో యజ్ఞంగానే చూసుకునేవారు. ఒక్క కండె చుడితే సీతమ్మ కళ్ళు పువ్వులయ్యేవి. ఒక జానెడునేస్తే పుట్టన్న పెదవుల మీద పొట్లపువ్వులు పూచేవి.

వారి పాక కెదురుగా ఒక గానుగచెట్టుంది. దానిక్రింద వారికున్న ఆవు కట్టి వేసి వుండేది. వెలిసిపోయిన కాషాయవర్ణం, ఒక్క వ్రేలెడు ఎడందాగా వచ్చి కలుసుకొన్న గిన్నె కొమ్ములు. పరోపకార బుద్ధితో బరువై క్రిందకు దిగిన పొదుగు. ఆ ఎర్ర ఆవుతో తెల్లటి కోడెదూడ. తల్లికి అందనంత దూరంలో కట్టి వేసివుండే ఆ దూడవంక అప్పుడప్పుడూ చూచి 'అంబా' అంటూ వుంటుందా గోమాత. తక్కిన సమయంలో మోర పైకెత్తి వూరువంక చూస్తుంది. ఆ గోమాత కా చిన్ని లేగ ఒక్కటే కాదు, ఆ పల్లెలో చాలామంది పెంపుడు పిల్లలున్నారు. వారందరివద్ద నుంచీ ప్రతి ఉదయం సాయంత్రం పాలకోసం కొమ్ము చెంబులు వస్తాయి. పుట్టన్న పాలు పితికి వాటిని నింపి తను వట్టి చెంబుతో ఇంట్లోకి వెడతాడు. ఆ వెళ్ళేటప్పుడు చూస్తే అతని ముఖంలో వెన్నెల రేఖలు కనిపిస్తాయి. పసిపాపల కోసం తన గోవుపాలు వినియోగపడ్డాయనే సంతృప్తే ఆ వెలుతురుకు కారణం.

పుట్టన్న వంశస్తులావూరులో చాలా కాలం నుంచి ఉంటున్నారు. తర తరాలుగా వచ్చే బాంధవ ముద్ర చెరిగిపోకుండా కాపాడుకోవడం అతని ముఖ్య ఆశయం. ఏ ఇంట్లో పెళ్ళి జరిగినా అతడు స్వయంగా నేసి మధుపర్కాలు పంపాలి. ఏటా జరిగే పెళ్ళిళ్ళ సమయంలో అతడు రాత్రింబగళ్ళు మగ్గం వద్దనే ఉంటాడు. సీతమ్మ రాట్నం మీద నుంచి చెయ్యి తీసినట్లే కనిపించదు. మధుపర్కాలకు వారేమి పైకం తీసుకోరు. వాటితో నూత్న వధూవరులు పీటల మీద కూర్చోవడం, తలంబ్రాలు పోసుకోవడం - చూడటం...... వారికళ్ళ నుంచి ఆనంద బాష్పాలు కురియడం...... అదో మామూలు.

పుణ్యం, ధర్మం జీవితానికి పెట్టని కోటలుగా భావిస్తూ జీవిస్తున్న పుట్టన్నకు, ధనంమీద ఆశలేదు. మూడు పూటలా కడుపును గంజితో నింపడం ఒక్కటే అతని ఆశయం. సీతమ్మ కూడా అంతకుమించి ఏమీ కోరదు. కాకపోతే గోవుకు మేత ఒకటి కావాలి. కాని, కొమ్ము చెంబులతో పాలకు వచ్చేవారంతా - చిట్టూ, తవుడూ, తెలకపిండి చెక్కలు, కానుకలుగా తెస్తూనే ఉంటారు. ఊరి ఆసామి...... కుప్ప నూర్పిళ్ళ కాలంలో అడక్కుండానే వరిగడ్డి తెచ్చి అతని దొడ్లో వామిపెట్టి పోతారు. జనపకట్టలు తెచ్చి ఇంటిమీద ఎండేసి పోతారు. పుట్టన్న వద్దని బ్రతిమాలినా వినరు. "నీ గోవు కామధేనువు పుట్టన్నా" అని వారు నవ్వుకొని వెళ్ళి పోతారు.

అయినా ఏటేటా అతడు లగ్నాలకు అందించే మధుపర్కాలతో సంపాదన అంతా హరించిపోయింది. అప్పు అడగడమంటే అతనికెంతో అభిమానం. అప్పంటే నే మాత్రం ఒప్పుకొంటానా, గూట్లో పిట్టల్లాగా కూర్చునే వాళ్ళను......

© SCERT not to be republished

గెడ్డలు పెట్టి కొట్టడం నే మాత్రం చూడగలనా' అంటుందామె. ఇల్లాంటి పరిస్థితిలో ఊరి పెద్ద కాపు పాపయ్యగారింట్లో పెళ్లి వచ్చింది. అసలు శ్రావణమాసంలో ఆ గ్రామంలో పెళ్ళిళ్లు చెయ్యరు. పాపయ్యగారి తల్లికి చూపు పోతోందన్న భయంతో పెళ్ళి తల పెట్టారు. "మసగ్గానైన మనుమరాలి పెళ్ళి చూడనియ్యవుట్రా నాయనా?" అన్న తల్లి మాటలకు జాలిపడి ఆయన ఆ నెలలోనే లగ్నం పెట్టించాడు.

"అదైనా అయిదురోజుల వ్యవధిలో పెట్టారు. సీతమ్మ నూతికిపోయి వస్తుంటే పాపయ్య కనబడి 'అప్పా, అమ్మాయి పెళ్ళికి లగ్నం పెట్టాం...... వచ్చే శనివారం...... బావతో చెప్పు' అన్నాడు.

"అలాగే అన్నయ్యా...... మంచిమాట చెవినేశావు. మంచినీళ్ళ బిందె ఇంట్లోదించి వచ్చి వదినతో మాట్లాడుతా" అంటూ వెళ్ళింది. మాట విన్నప్పుడు సీతమ్మ ముఖంలో చిరునవ్వు తొంగిచూచింది గాని...... నాలుగు అడుగులు వేయగానే ఆ నవ్వు అంతరించిపోయింది. వడివడిగా వెళ్ళి బిందె దించింది. భర్తతో ఈ వార్త చెప్పింది. అతడూ వినగానే నవ్వాడు. కాని ఆ నవ్వు కూడా గాలిలో వెలిగించిన దీపంలాగా గప్పున ఆరిపోయింది.

"కాయకష్టమైతే చేస్తాం...... నూలెలా వస్తుంది" అని అతడు విచారపడ్డాడు.

"పోనీ ఈ ఒక్కమాటుకీ......" అని వూరుకొంది సీతమ్మ.

"ఒక్కమాటుకీ? ఆచారం ఆపివేద్దామంటావా!...... ఆచారం నే నాపలేను...... పుట్టన్న పట్టరాని కోపంతో.

"ఆచారం ఆపమనలేదు......"

"మరేమిటి నువ్వన్నది?"

"పోనీ అప్పు......"

"నాకు చెప్పకామాట...... ఒక్క రూపాయి అప్పుచేస్తే...... ఇచ్చినవాడికి ఎక్కడలేని చనువూ వస్తుంది. కాసేపైనా చక్కగా పడుతోంది నిద్ర...... అది కూడ పోతుంది. అందాకా దేనికి, అప్పుమాట జ్ఞాపకంవస్తే మగ్గంలో కూర్చుని ఇటుకండె అటూ, అటుకండె ఇటూ విసిరే స్థిమితం వుంటుందా, అప్పు మాత్రం చెయ్యను" అన్నాడతడు – ఉత్తరీయం కొంగుతో కళ్లు ఒత్తుకుంటూ. తానా మాట ఎత్తడం తప్పని సీతమ్మ లోలోపల బాధపడుతూ "అవును. చెయ్యొద్దు" అంది.

వారిద్దరూ చాలాసేపు మౌనంగా కూర్చున్నారు. అప్పుడు పుట్టన్న మొఖం అరచేతుల్లో దాచుకొని అన్నాడు "పోనీ ఆవును" సీతమ్మ "ఆవునా?" అన్నది. మళ్ళీ ఇద్దరి మధ్యా నిశ్శబ్దం వచ్చి నిలచింది. గుండెల్లో చెప్పరాని దడదడ పుట్టింది.

"ఏం చేస్తాం? తరతరాలా వచ్చే ఆచారాన్ని పోగొట్టుకోవడంకన్నా గోవును వదులుకోవడం మంచిదికదూ, ఈ లగ్నానికీ వస్త్రాలందిస్తే చాలు. అంతగా అయితే మళ్ళీ పెళ్లిళ్ల కాలం వచ్చేసరికి వూళ్లోనుంచి లేచిపోదాం. పొరుగూరికి ఆచారాలు వెంటరావుగా" అన్నాడతడు.

"కాని, ఆవును అమ్మితే పాలకు వచ్చేవాళ్ళంతా ఏమైపోతారు?" అన్నదామె.

"ఏంచేస్తాం? పోనీ ఒక పనిచేద్దాం......" ఆవును ఊళ్లోనే అమ్ముదాం. పిల్ల పాలవాళ్లంతా అక్కడికే పోయి తెచ్చుకొంటారు" అన్నాడు.

"వాళ్లకంత బుద్ధి పుట్టొద్దూ" అంది సీతమ్మ.

"అంతకంటె మనమాలోచించలేమో, ఆవును ఈపూటే బేరం పెడతా...... చద్దన్నం తిని బస్తీకి వెళ్లి నూలుతెస్తా" అన్నాడు పుట్టన్న.

సీతమ్మ "సరే!" అంది. పుట్టన్న కళ్లనీళ్లు ఉత్తరీయంతో గట్టిగా తుడుచుకొని, కొప్పులాగా ఉన్న జుట్టుముడిని ఒక్కసారివిప్పి, దులిపి, మళ్లీ ముడివేసుకొని బయలుదేరాడు.

అప్పుడే సందెవెలుగులు దూసుకువస్తున్నాయి. గానుగచెట్టు చిటారు కొమ్మకు అతికించినట్లుగా నెలవంక కనిపిస్తూన్నాడు. పుట్టన్న వాకిట్లోకి రాగానే ఆవు "అంబా" అని అరిచింది. పుట్టన్నకు పట్టరాని దుఃఖం వచ్చింది. వెళ్లి దాని మెడ కౌగలించుకొన్నాడు. "నా మీద కోపం వచ్చిందా? అమ్ముతున్నానని బాధపడుతున్నావా ఏం చెయ్యను, ఆచారం కోసం అమ్ముకోవలసివచ్చింది. నువ్వెక్కడున్నా ప్రతి రోజువచ్చి చూస్తా...... నిన్ను దైవం లాగా కొలుస్తున్నా.

నువ్వు కాపాడకపోతే ఎవరు కాపాడుతారు నన్ను?" అని మెడ వదలి ఉత్తరీయంతో దాని ఒళ్లంతా తుడిచాడు. దానిని విడవలేక విడవలేక ఊళ్లోకి వెళ్లాడు.

మరునాడు ఉదయం పుట్టన్న లేచి గానుగపుల్ల విరిచి ముఖం కడుక్కొంటున్నాడు. తూర్పు దిక్కున సూర్యుడు సగం పైకిరాగా – చల్లటి ఎండ వచ్చి పల్లె మీద పడుతోంది. పక్షులు గూళ్ళల్లో ఉండే రెక్కలు విదలించుకొంటున్నాయి. పుట్టన్న ఇంటికి కొమ్ముల చెంబులు వచ్చినాయి. వారికి ఆవు కనిపించలేదు. పుట్టన్నా! ఆవేది?" అన్నదొక ముసలమ్మ. పుట్టన్న వెనక్కి తిరక్కుండానే "అమ్మేశా తల్లీ అచ్చన్న గారికి".

"అయ్యో! అమ్మేశావా! ఇక మా పిల్లల గతేమిటి! గుక్కెడు పాలు పోస్తున్నాం – గనక కక్కటిల్లకుండా పరుంటున్నారు" అన్నదా అవ్వ.

"ఏం చెయ్యను తల్లీ! అలా వచ్చింది కాలం. అమ్మేటప్పుడు అచ్చన్నతో చెప్పాను. పిల్ల పాలు మాత్రం పోస్తూ ఉండాలి సుమా" అని.

వచ్చినవారంతా దీనంగా నిలబడ్డారు.

పిల్ల పాలకోసం వచ్చినవారిలో ఆ వూరి పూజారికూడా ఉన్నాడు. ఆయన ముందుకువచ్చి ఇలా అన్నాడు – "నువ్వు ఋషిలాంటివాడవు గనుక, పసిపిల్లల కోసం త్యాగం చేశావు. నువ్వుచేసే దానం వల్ల ఎందరు పిల్లలు కడుపులు నిండి కమ్మటినిద్ర పోతున్నారు? ఎందరు తల్లులచూపులు చల్లగా ఉంటున్నాయి?"

"ఏంచెయ్యను బాబు......నే బ్రతకడం కోసం అయితే ఆవుని అమ్మేవాణ్ణి కాను, పరువు బ్రతికించుకోవడం కోసం అమ్మాల్సి వచ్చింది" అన్నాడు పుట్టన్న.

"అది మా దురదృష్టం" – అన్నాడు పురోహితుడు.

ఇంతలో సీతమ్మ బైటికివచ్చి కుడితికుండ "ఇదిగో! నిన్నే! ఈ కుడితి అచ్చన్నగారింటి దగ్గర ఇచ్చొస్తా......" అంది.

"ఇచ్చిరా! ఈ పూటతో ఈ కుడితితో మనకూ, ఆవుకూ ఉన్న ఋణం తీరిపోతుంది" అన్నాడు వెనక్కి తిరక్కుండానే. సీతమ్మ కన్నీరు చీరకొంగుతో తుడుచుకొంటూ వెళ్ళిపోయింది. పాలకు వచ్చినవారు కూడా ఒక్కొక్కరే వెళ్ళిపోయారు. మరికొంచెం సేపటికి పుట్టన్న వెనక్కి తిరిగి చూచాడు. సిరి తొలిగిపోయిన తరువాత మిగిలిన నిరుపయోగజీవిలాగా కనిపిస్తోంది – కట్టుకొయ్య. పుట్టన్న మనస్సు బావురుమన్నది. దాన్ని పీకి దూరంగా గిరాటువేద్దామనుకొని, గుంజిచూశాడు. అది – రాలేదు. కాళ్ళీడ్చుకుంటూ ఇంట్లోకి వెళ్లాడు.

ఆ రోజే బయలుదేరి బస్తీకి వెళ్ళాడు. నూలు తెచ్చాడు. ఆ నాలుగు రోజులు అతడు మగ్గం గోతిలో నుంచి లేవలేదు. సీతమ్మ రాట్నం వదలలేదు. నాలుగురోజులు గడిచాయి. తెల్లారే లగ్నం...... ఆ సందెవేళ ఆముదం దీపాలు – అటూఇటూ పెట్టి నేత నేస్తున్నాడు పుట్టన్న. ఇంతట్లోనే చెరువుగట్టున మేళాలు మ్రోగినాయి. "పెళ్ళివారు దిగారు" అంది సీతమ్మ. "ఇంకొక్క ఘడియలో నేత పూర్తి అవుతుంది" అన్నాడు పుట్టన్న. మరి కాసేపటికి పల్లకి, దానివెంట బళ్ళూ ఆ వీధినే వచ్చాయి. సీతమ్మ చూడటానికి బైటికి వెళ్ళింది. ఇలాయి బుడ్ల వెలుతుర్లో పెళ్ళికొడుకును చూచింది. వెంట ఇరవై బళ్లున్నాయి. అన్నీ వాళ్ళ ఇల్లు దాటిపోయేదాకా నిలబడి చూచి ఇంట్లోకి వచ్చింది సీతమ్మ "పెళ్ళికొడుకు కళ్ళూ, ముఖం బాగానే ఉన్నాయి. పాతికేళ్లుంటాయి. అయినా ఫరవాలా! ఈడుగానే ఉంటాడు. పార్వతి మాత్రం ఒడ్డూ పొడుగూ లేదూ" అంది.

"ఎవరికెలాంటి మొగుణ్ణి తేవాలో ఆదేవుడికి తెలియదేమిటే" అన్నాడు పుట్టన్న.

ఇంకొక గంటసేపటికి మధుపర్కాలు – తీసుకువెళ్ళడం కోసం మేళాలతో పెళ్ళివారు వచ్చారు. సీతమ్మ మధుపర్కాలు మడతపెట్టి ఇంట్లో ఉన్న దేవుడిపటం దగ్గర పెట్టి నమస్కరించి తెచ్చింది. ఒక ముత్తయిదువ ఆమె నుదుట కుంకంపెట్టి పళ్లు, తాంబూలం ఇచ్చింది. ప్రక్కనున్న మగాయన "పుట్టన్నా! తెల్లారి జానెడు ప్రొద్దెక్కే లగ్నం...... నువ్వు పెందరాళే లేచి రావాలి" అన్నాడు. పుట్టన్న ముసిముసి నవ్వులు నవ్వుతూ "కాలుకడిగి కన్యాదానం చేస్తుంటే దేవతలు తొంగి చూస్తారట. నరుడు రాకుండా ఉంటాడా!" అన్నాడు. వచ్చిన మంగళ వాయిద్యాలతో మధుపర్కాలు తీసుకొని వెళ్ళిపోయారు. పుట్టన్న దంపతుల మనస్సులు మల్లెపందిరిగా మారిపోయాయి.

© SCERT not to be republished

తెల్లవారింది. పాపయ్యగారింట్లో పెళ్ళి వైభవంగా జరుగుతోంది. అర ఎకరం పందిరి వేసినా జనం పట్టక కిటకిటలాడిపోతున్నారు. ఒక పందిరి గుంజనానుకొని సీతమ్మ నిలబడింది, ఆవిడకు కొంచెం పక్కగా పుట్టన్న ఉన్నాడు. నూతన దంపతులు తలంబ్రాలు పోసుకుంటున్నారు. సన్నాయిపాట సాగిపోతోంది, సంతోష తరంగాలుగా. పిల్ల తల్లితండ్రులు ఒకరినొకరు ఎరగనంత క్రొత్తగా చూచుకుంటున్నారెందుకో. పుట్టన్న తన ధర్మం నెరవేర్చుకొన్నాననన్న ఆనందంలో మునిగిపోయాడు. లగ్నం అయింది. 'అందరు భోజనాలకు పదండీ' అన్న కేకలు నాలుగువైపుల నుంచి వినిపించాయి. అంతా వెళ్ళినా పుట్టన్న. సీతమ్మ గోడ ప్రక్కగా నిలబడి – ఏదో చెప్పుకొని నవ్వుతున్నారు. పాపయ్య చూశాడు వారిని.

"యేం అక్కా నువ్విక్కడే ఉన్నావు – బావయ్య అలిగాడా? కలిగిందేదో పెడతాం. అంత అలిగితే ఎలా బావా" అన్నాడు.

"అలిగినవాళ్ళ కిక్కడ అత్తెసరు వెయ్యలేదని చెపుతున్నా" అని సీతమ్మ నవ్వింది.

"అంత అలగాలని ఉంటే తిని అలుగుతాను గాని, పప్పన్నం వదులుతానా" అన్నాడు పుట్టన్న.



© SCERT not to be republished

పాపయ్య నవ్వి "పదండి లోపలికి" అంటూ బైటి గుమ్మంవైపు వెళ్ళి వాకిట్లో ఇంకెవరన్నా ఉన్నారేమోనని చూచివచ్చాడు.



మధుపర్కాలు తీసుకొని వెళ్ళి ఇచ్చిందాక ఒక దీక్షతో ఉన్నారు పుట్టన్న దంపతులు. ఆ కార్యం నెరవేరింది. వారి మనసులో బరువు తగ్గింది. తగ్గిన తర్వాత ఆవు మీద బెంగ అధికమైంది. ఎలాగో మనస్సుకు సంతృప్తి తెచ్చుకొని నిద్రపోయారు. కాని నిద్రలో వారికా గోమాత ప్రత్యక్షమైంది. పుట్టన్నకు ఆవు 'అంబా' అని అరుస్తూన్నట్లు వినిపించింది. దిగ్గనలేచి వెళ్ళి ఇంటిమీద ఉన్న జనప కట్ట తీసుకుని గానుగచెట్టు దగ్గరికి వెళ్ళాఢు. బిక్కు బిక్కు మంటూ కట్టుకొయ్య కనిపించింది. అతడి మనస్సు చిట్లి, కొన్ని బెల్లులూడిపోయినట్లయింది. తిరిగివచ్చి ఇంట్లో పడుకొన్నాడు. నిద్ర రావడం లేదు. ఆవు ముట్టెతెచ్చి అతని పొట్టమీద నెట్టి గోకమన్నట్లుగా తోచింది. గభాలున లేచి కూర్చున్నాడు. చూపు చూరులోకీ, మనస్సు శూన్యంలోకీ చొచ్చుకుపోతోంది. "నువ్వు పోసిన పాలు త్రాగి పసి పిల్లలు గుక్కలు మాని నిద్రపోతున్నారు" అని పూజారి అన్నమాటలు వినిపించినాయి. ఆ భావాన్ని తరుముకొంటూ వెనకనుంచి పసిపిల్లల ఏడ్పులు వినిపించినాయి. చెవులు గట్టిగా మూసుకొని "సీతా" అని పిలిచాడు. ఆమె లేచింది. తన అనుభూతి అంతా చెప్పాడు. "అయిపోయినదాని కింత దిగులైతే ఎలా? ముందు సంగతి ఆలోచించాలిగాని" అన్నదామె. "ముందు సంగతి ఆలోచించాడా దేవుడు. జరిగినదానికి విచారపడటం ఒక్కటే మన పని" అని పుట్టన్న బైటికి వెళ్ళాడు. తూర్పురేక లారుతున్నాయి. పుట్టన్న కట్టుకొయ్యవైపు చూడలేక తలవంచుకొన్నాడు. 'అంబా' అనే పిలుపు వినిపించింది. అదీ తన భ్రమే ననుకొంటూ తలఎత్తాడు. గానుగ చెట్టు క్రింద ఆవు నిలబడి ఉంది. పరుగెత్తుకు వెళ్లాడు. దాని మెడ కవుగలించుకొన్నాడు. "సీతా! సీతా" అని పిలిచాడు. ఆమె వచ్చింది. "ఆవు తెంచుకు వచ్చింది" అన్నాడు. "తెంచుకు రావడమేమిటి కట్టుకొయ్యకు కట్టేసివుంటే" అన్నదామె. ఇద్దరూ విస్తుపోయారు. ఎవరుతెచ్చి కట్టివేస్తారు. "తెంచుకొని వీధివెంట పోతుంటే ఎవరైనా తెచ్చి కట్టేసి ఉంటారు. వాళ్లకు మనం అమ్మివేశామని తెలియదుగామన్న" అంటూ పుట్టన్న ఉత్తరీయంతో కొమ్ములు తుడుస్తున్నాడు. ఒక కొమ్ము తుడుస్తూంటే "త్యాగం నువ్వు నేర్పిందే" అన్నట్లు రెండోది తుడుస్తూంటే "నీ పవిత్రత మాకెలావస్తుంది" అన్నట్లు ఉంది. పాలవేళ అయింది. "తోలుకుపోయి అచ్చన్న ఇంట వదలివద్దాం" అన్నాడు భర్త. "ఒక్క జనపకట్ట తిన్న తర్వాత తోలుకుపోదాం" అన్నది భార్య. "అక్కడికే పట్టుకుపోయివేద్దాం. పిల్లపాలవాళ్లు వచ్చి నిలబడతారేమో!" అంటూ అతడు త్రాడు విప్పాడు. అతడు త్రాడు పుచ్చుకు ముందు నడవబోతాడు. గోవు కదలలేదు. తప్పదు తల్లీ!" అతనికి అప్పగించిరావాలి" అన్నాడు పుట్టన్న. ఆ మాట ఆలకించినట్లుగానే అడుగులు వేసింది ఆవు. సీతమ్మ జనపకట్ట చంకను పెట్టుకొని వెంట నడుస్తోంది కాస్త దూరం వెళ్ళేటప్పటికి అచ్చన్న ఎదురొచ్చాడు. పాపయ్య గారి అల్లుడు డబ్బిచ్చాడని తనే తోలుకువచ్చి కట్టేశాననీ చెప్పాడు.

భార్యభర్తలిద్దరూ ఒకరి మొగం వంక ఒకరు చూసుకొన్నారు. "ఆయన డబ్బివ్వడమేమిటి! అన్నాడు పుట్టన్న. "అప్పేమో" అంది సీతమ్మ. "ఆవును కట్టేసివెళ్లి అడుగుదాం పదా" "మీ ఇంటిదగ్గరే కట్టేసుకోబావా సొమ్ము నా సంచిలో పడిందిగా" అన్నాడు అచ్చన్న. ఆవును తోలుకు తెచ్చి గానుగచెట్టు క్రింద కట్టేసి, భార్యాభర్తలిద్దరూ బయలుదేరి పాపయ్యగారి ఇంటికి వెళ్ళారు.

వెండి పువ్వులున్న పీటమీద కూర్చుని, వెండి మరచెంబు దగ్గిర పెట్టుకొని ముఖం తోముకుంటున్నాడు పాపయ్యగారి అల్లుడు. మామగారు అరుగుక్రింద నుంచుని, అల్లుడైనా పలకరిస్తాడేమో, జవాబు చెప్పాలని ఉబలాట పడుతున్నాడు. పాపయ్యగారి భార్య కిటికీ దగ్గరికి వచ్చి అల్లుణ్ణి చూసి, పమిటి వెడల్పు చేసి కప్పుకొని, భర్తవంక చూచి చిరునవ్వు నవ్వింది. వెళ్ళిపొమ్మనే భావంతో నాలిక ములగాకంత బయటపెట్టాడు భర్త. ఇంతలో పుట్టన్న దంపతులు వచ్చారు వాకిట్లోకి. పాపయ్య "ఏమిటిబావా ! పొద్దునే వచ్చావు! మా చెల్లెల్ని పుట్టింట్లో దించిపోదామనా" అన్నాడు.

"దానికైతే నే రావాలా కోడళ్లు పుట్టింటికి వెళ్ళడానికి – కోయిల కూయడానికి ఒకళ్ల పెత్తనం అక్కర్లేదని మా పెద్దమ్మ చెపుతూ ఉండేది" అన్నాడు పుట్టన్న.

పాపయ్యకు నవ్వు వచ్చిందిగాని. అల్లుడున్నాడని జ్ఞాపకంవచ్చి ఆపుకొని ఓరకంటితో ఆయనవంకే చూచాడు. రామ్మూర్తి నీళ్ళు పుక్కిలించబోయాడు – నవ్వు ఆపుకోలేక వుమ్మేశాడు.

"మా పుట్టన్నబావ ! మీకు మధుపర్కాలు తెచ్చి యిచ్చిందీయనే! మీకే కాదు, ఊళ్లో యెక్కడ పెళ్ళయినా, ఈయనే తెచ్చిస్తాడు. కానీ పుచ్చుకోడు. అంత ధర్మాత్ముడు" అన్నాడు పాపయ్య.

"తెలుసు" అన్నాడు రామ్మూర్తి.

"నే చేసేదీ ఒక ధర్మమేనా? గుళ్లు కట్టించానా, గోపురాలు కట్టించానా, సత్రవులు వేశానా, ఒక మాట అడగాలని వచ్చాను అల్లుడుగార్ని!" అన్నాడు పుట్టన్న.

"ఏమిటది!" అన్నాడు పాపయ్య ఆశ్చర్యంతో.

"నేను అచ్చన్నకు ఆవును అమ్మాను. అది కొనితెచ్చి మళ్ళీ నా వాకిట్లో కట్టేశారు మీ అల్లుడుగారు."

"ఆ! మీ ఆవునా!..."

"అవును...కట్టేశాను..మీద్వారా నేర్చుకున్న విద్యే అది. మీరు ధర్మం కోసం అమ్మనూ అమ్మారు. నేనూ ధర్మం కోసమే అది కొనితెచ్చి మీ కిచ్చాను. మావంటి యువకులు త్యాగం, ధర్మం నేర్చుకోవడం తప్పంటారా!"

"తప్పనడంలేదు.....మీరు ఆవును నావంటివాడికి దానం చెయ్యడమేమిటా అంటున్నాను. ఏ పిల్లలున్న వాళ్ళకో ఇస్తే పుణ్యం వస్తుందిగాని నావంటివాడికీ..."

"నాకు తెలుసు తాతా!...ఆ ఆవు నీదగ్గర వుంటే రోజూ పదిమంది పసిపిల్లలకు పాలు దొరుకుతున్నాయి. ఇంకెవరికిచ్చినా వాళ్ళ కడుపులే నిండుతాయి...."

"నిజమేననుకోండి. అయినా నేను మీ దగ్గర ఆవును తీసుకోవడం మంచిది కాదు ...నే నోటు వ్రాస్తా మీకు.."

"నోటు రాస్తావా తాతా! ఏం నోటు వ్రాసి ఇచ్చామని మాకు మధుపర్కాలు తెచ్చావు! మొదటినుంచి నువ్వు మధుపర్కాలద్వారా తీర్చేవి నోటు బాకీలేనా!...సహాయ సహకారాలు, ధర్మాలు లేక ఇలా నోట్లు పుట్టినాయి. లేనివారి లోట్లు వున్నవారు తీర్చడమే ధర్మం' అని భగవంతుడు ఒకేసారి మానవజాతికి దస్తావేజు వ్రాసి ఇచ్చాడు".

పార్వతీ కిటికీలోనుంచి ఈ సంభాషణ అంతా వింటూనే వుంది. పుట్టన్న మాట్లాడకుండా నిలబడ్డాడు. పాపయ్యగారికి అల్లుడి మాటలు అమృతపు జల్లులుగా తోచాయి. ఆ మాటల కిటికీల ద్వారా అల్లుని హృదయంలోకి తొంగిచూస్తున్నాడు. తనభాగ్యం మంచిదై ఈ అల్లుడు లభించాడను కొన్నాడు. కాదు కాదు – మా పార్వతి చేసుకొన్న పూర్వపుణ్యం అనుకొన్నాడు.

అల్లుడు పుట్టన్నతో యిలా అన్నాడు.

"తాతా! పోనీ ఆ ఆవు నీది కాదనుకో, దానికి నువ్వు ధర్మకర్తవనుకో.... గ్రామంలో పిల్లలకు ఆ క్షీరం దానంచేస్తూ వుండు."

పుట్టన్నకి పట్టరాని సంతోషం వచ్చింది. "అట్లాంటి పనిఅయితే చెయ్యడానికేం బాబూ! గంతులేస్తూ చేస్తా. పెద్దవాళ్ళకు చేసిన సహాయంలోనే ఎంతో పుణ్యం వుంటుందంటారు. పసివాళ్లకు చేసిన సేవ భగవంతుడిసేవే నంటారు. ఇట్టాంటి పని చెపితే, ఎట్టాంటివాడైన ఒప్పుకొంటాడు..అయితే నే వెళ్లివస్తా. ఈ మాట మా ఆవిడికి చెప్పి మళ్లీవస్తా...మీకెట్టా దణ్ణంపెట్టాలో

© SCERT not to be republished

తెలియడంలా...మీరీవూరు వచ్చినప్పుడల్లా..నన్ను ...నా ఆవునీ చూచి వెళ్ళాలి." అని రెండడుగులువేసి గిరుక్కున వెనక్కు తిరిగి," మరిమీది చిన్నతనమైనా, చాలా మంచి మనస్సండి. 'మంచివూహాలు గలవారి పంచనే బ్రతకమంటారు' పెద్దలు. మీరీ వూరినుంచి వెళ్ళేదాకా-ఈ అరుగుదగ్గరే నుంచుంటా. ఇంకేమన్నా మంచిమాటలు చెప్పాలని వుంటే చెప్పండి.. ఉండండి ఆవు మాట మా ఆవిడకి చెప్పివస్తా... దాన్నికూడా తీసుకొస్తా మీకు దణ్ణంపెట్టడానికి" అని మళ్లీ తిరిగి వెళ్లబోయాడు.

"తాతా!" అన్నాడు అల్లుడు.

"ఏమిటి బాబూ! ఏమన్నా మంచిమాట తట్టిందా! చెప్పండి...త్వరగా చెప్పండి".

"చెపుతా, నిన్ను నీ ఉత్సాహాన్ని చూస్తుంటే మంచి మాటలకు కరువా తాతా! చెపుతున్నా విను. నాకు చాలా ఆస్తివుంది. మా మామగారు మర్యాదకోసం నాకో రెండెకరాల మాన్యం వ్రాసియిచ్చారు, కానుకంటే కాదనలేకపోయాను...దాన్ని నేనెవరికి కానుకగా ఇవ్వాలా అని ఆలోచించా, ఇప్పటికి తేలింది. నువ్వు నూతన దంపతులకు మధుపర్కాలు కప్పి సత్కరిస్తూవచ్చిన మహా దాతవి. నా రెండెకరాల మాన్యం నీకు వ్రాసిస్తా. దానికి మధుపర్కాల మాన్యం అని పేరు పెడతా. ఆ ఫలసాయంతో నువ్వు మధుపర్కాలు నేసి మామూలుగా నూతన దంపతులకు కానుకలిస్తూ వుండు...ఏం తాతా?"

"ఆ! మాన్యమా! మధుపర్కాల మాన్యమా! మరి, అది పుచ్చుకుంటే నా సేవేం వుంటుందందు లో...వద్దులెండి...వద్దు..." అని పుట్టన్న కేకలు పెట్టాడు.

"అలా అనకు తాతా! ఫలసాయం ఎంతవచ్చినా అది నూలికి సరిపోతుంది. కాని మధుపర్కాలు తయారుకావాలంటే నీ సేవ ఎంతో కావాలి. అంతేకాదు తాతా...ఆ పడుగు పేకల్లో నీ పవిత్రాత్మకూడా ప్రతిబింబిస్తుంది. ఉత్తమమైన నేత పరిశ్రమ నారాధించడమే కాకుండా వాటిని దానంచేసే నీ ఆత్మ ఎంత గొప్పది తాతా! నీవంటివారిలోనే జాతీయ జీవనం తన ప్రాచీన రూపాన్ని ఇప్పటికీ కాపాడుకొంటోంది!..గ్రామ జీవనానికి వెన్నెల స్తంభాలవంటి ఈ పరిశ్రమల్ని పోషించేవారికంటే దేశభక్తులు, త్యాగమూర్తులూ వేరెవరున్నారు తాతా! గ్రామం ఒక పాలవెల్లి. దానిలో పువ్వులు మీ వంటివారు. తాతా! ఈ పూటే దస్తావేజు వ్రాయిస్తాను?"...

పుట్టన్నకు సంతోషంతో గొంతు పూడిపోయి ఎంతో నత్తివచ్చింది. ఏం చెప్పాలో తోచక గిరగిర తిరుగుతున్నాడు. చివరకు "సరేబాబూ..ఇదికూడా మా ఆవిడతో చెప్పొస్తా. ఏదైనా మంచిమాట విన్నప్పుడు ఒక్కణ్ణే ఆలోచించలేను....,, వెంటనే దాంతో చెప్పాలి. చెప్పి మళ్లీ వస్తా" అంటూ పరుగెత్తాడు.

© SCERT not to be republished

**కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

(1) పుట్టన్న దంపతుల ఆచారమేమి? దాన్ని కొనసాగించటానికి ఆయన చేసిన త్యాగమేమి?

(2) ఈ కథ వల్ల పల్లెటూళ్ళలోని మనుషుల మధ్య ఆత్మీయతానుబంధాలు ఎలా ఉన్నాయని మీకనిపించింది?

(3) పుట్టన్న దంపతుల మంచితనాన్ని వర్ణిస్తూ పది వాక్యాలు రాయండి?

(4) ఈ పాఠంలోని అల్లుడుగారి పాత్ర ద్వారా ఎలాంటి ఆదర్శాన్ని గ్రహించారు?

# www. కారడవి. కామ్



ఒక దట్టమైన అడవి ఉండేది. ఈ అడవిలోని దారులు మభ్యపెట్టేవిగా ఉండేవి. అందువల్ల ఈ అడవిలోకి వెళ్ళడానికి వేటగాళ్ళు కూడా భయపడేవారు. చాలా ఏళ్ళకిందట కొందరు వేటగాళ్ళు కారడవిలోకి వెళ్ళడానికి ప్రయత్నించారు. కానీ వారు తిరిగిరాలేదు. దాంతో ప్రజలు ఈ అడవి గురించి రకరకాల కథలు అల్లేవారు. అడవి దట్టంగా ఉండడంవల్ల దారి మరచిపోయే ప్రమాదం ఉందనీ అటవీ శాఖవారు అనేవారు. పైగా, ఏ చెట్టుమీద కూర్చున్న ఏ పులి ఎప్పుడు దాడిచేస్తుందో? ఏ చిరుత ఎప్పుడు మెడపట్టుకుంటుందో? హఠాత్తుగా ఏ ఎలుగుబంటి ఎదురువస్తుందో? అనే భయం ఉండేది. అటవీశాఖవారు నిర్మించిన రోడ్లమీద నుంచి కలపమోసే ట్రక్కులు వస్తూ-పోతూ ఉండేవి. కాని అడవికి 'గూండా' జగ్గూ దౌర్జన్యం విస్తరించినప్పటి నుంచి కాంట్రాక్టర్లకి కలపతో ట్రక్కులు నింపి పట్టుకొని వెళ్ళడం కష్టమైంది. జగ్గూ మనుషులు ప్రతి కాంట్రాక్టరుతో వేరు-వేరుగా మామూళ్ళు వసూలు చేసేవారు.

కారడవిలో గత కొన్నిరోజుల కింద ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. బిహారి అనే కోతి చాలారోజుల నుంచి కనబడలేదు. అకస్మాత్తుగా అతడు తిరిగి కనబడగానే అడవి జంతువులు అతడు కనబడకపోవడానికి కారణం అడిగాయి. అందుకు బిహారి తాను పక్కనున్న పట్టణానికి కంప్యూటర్ నేర్చుకోవడానికి వెళ్ళానని చెప్పాడు. ఇప్పుడు తాను ఒక వెబ్‌సైట్ కూడా తెరిచానని చెప్పాడు. దానిపేరు www. కారడవి.కామ్. తరువాత అందరినీ తాను కంప్యూటర్ మొదలైనవి పెట్టిన చోటుకి తీసుకుని వెళ్ళాడు. అడవికి రాజయిన సింహం అడిగాడు. "బిహారి దీనివల్ల అడవిలోని జంతువులకు ఏమిటి లాభం?" అని.

బిహారీ అన్నాడు "ప్రభూ! ఇది కొత్త ప్రపంచపు అద్భుతం. కంప్యూటర్‌వల్ల ప్రపంచమంతా పరస్పరం కలుస్తోంది. మన కారడవి రహస్యాలు, సంగతులన్నీ నా వెబ్‌సైట్ ద్వారా ప్రపంచానికి తెలుస్తాయి.

"మూర్ఖుడా, ఎంత పనిచేశావు! మనందరి చావును పిలుచుకువచ్చావు." సింహం కోపంగా గద్దించింది. "లేదు ప్రభూ! అలా ఏమి జరగదు. ఎవరికైనా ఏ సమాచారమైనా కావలసి ఉంటే ఈ-మెయిల్ ద్వారా నన్నే కదా అడగాలి. నేను నా ఈ-మెయిల్ చిరునామా - "బిహారి@హాట్‌మెయిల్.కామ్" ఇచ్చాను. ఏ జంతువు నివాసం ఎక్కడ ఉందో దాన్ని చేరుకునే దారి ఏమిటో నేను ఎప్పుడూ చెప్పను".

సింహం వెళ్ళిపోయిన తర్వాత కోతి బీహారి అక్కడున్న జంతువులకి కంప్యూటర్ గేమ్‌లు చూపిస్తూ వినోదం కలిగించసాగాడు.


కారడవికి దగ్గరగా ఉన్న పట్టణం అనూప్‌గంజ్. ఇక్కడ ముఖ్తార్‌సింగ్ ఎం.ఎల్.ఏ., ముఖ్యమైన నాయకుడు. గూండా జగ్గూ దౌర్జన్యాన్ని నిలువరిస్తానని ఆయన ప్రజలకు మాట ఇచ్చాడు. ఇది విని జగ్గూ మండిపడ్డాడు. ముఖ్తార్‌సింగ్‌ని కిడ్నాప్ చేసి కారడవి మధ్యలో బంధించాడు. ప్రభుత్వానికీ, పోలీసులకు ఏం చేయాలో

© SCERT not to be republished

పాలుపోలేదు. ఆ రాత్రి పోలీస్‌కమీషనర్ ఇంట్లో సమావేశం జరుగుతోంది. అకస్మాత్తుగా కమీషనర్‌గారి పది సంవత్సరాల కొడుకు రాజు ఆయాసపడుతూ వచ్చాడు. "నాన్నా! నేనిప్పుడే ఇంటర్నెట్‌లో ఒక కొత్త వెబ్‌సైట్ చూశాను. దానిపేరు www. కారడవి.కామ్. దాంట్లో మీకు కారడవి వివరాలు దొరకవచ్చు".


ఈ వింత వెబ్‌సైట్ గురించి అందరు పోలీసు అధికారుల్లో ఆసక్తి పెరిగింది. వారు వెంటనే ఆ వెబ్‌సైట్ తెరిచారు. అందులో నిజంగానే కారడవి గురించి వివరాలు ఉన్నాయి. ఆ వెబ్‌సైట్‌లో, మరిన్ని వివరాల కోసం ఈ-మెయిల్ చిరునామా www. బిహారి.కామ్ అని ఉన్నది. ఇది ఎవరై ఉంటారు. ఒక కోతి వెబ్‌సైట్‌ని ఎలా తెరిచి ఉంటుంది? అయితే పోలీసుఅధికారులు ఇప్పుడీ ప్రశ్నలన్నీ వదిలిపెట్టి ముఖ్తార్‌సింగ్ గురించి తెలుసుకోవడానికి ఈ- మెయిల్ పంపారు. "అడవి దొంగ జగ్గానే ఎం.ఎల్.ఏ ముఖ్తార్‌సింగ్‌ని ఎత్తుకువెళ్ళాడు. నువ్వు అతడి నివాసమెక్కడ ఉందో, అక్కడికి చేరే మార్గమేమిటో చెప్పగలవా?" ఈ-మెయిల్ చదివిన కోతి బిహారికి ఈ విషయమంతా అర్థమైపోయింది. అతడు వారికి పూర్తి అడవిమ్యాపుని పంపడంతోపాటు అక్కడి దాకా వారు చేరుకోవడానికి కోతుల ద్వారా దారిచూపే ఏర్పాటు చేశాడు.

బిహారి పంపిన మ్యాపు ప్రకారం వారు సరైనచోటుకి చేరుకున్నారు. అక్కడికి అసలు ఎవరైనా చేరుకోగలరని జగ్గా కలలో కూడా ఊహించలేదు. అతడు తన అనుచరులతో జల్సా చేసుకుంటున్నాడు. హఠాత్తుగా పోలీసు కమాండోలు వారిని చుట్టుముట్టారు. జగ్గాకు సంభాళించుకునే అవకాశం కూడా దొరకలేదు. కన్నుమూసి తెరిచే లోపల అక్కడి దృశ్యం మారిపోయింది. ముఖ్తార్‌సింగ్ విడుదలయ్యాడు. జగ్గా అతడి అనుచరులు నిర్బంధంలోకి తీసుకోబడ్డారు.



దీనితో కారడవిలో జగ్గా ముఠా అంతం అయింది. అందరూ పోలీసులను మెచ్చుకున్నారు. పోలీసుల సిఫార్సుతో ప్రభుత్వం అత్యుత్తమ వెబ్‌సైట్‌గా www. కారడవి.కామ్.ను ప్రకటించింది. దీనితో కోతి బిహారి ధైర్యం ఇంకా పెరిగిపోయింది.

కోతి బిహారి తన గుహ బయట ఒక సైన్‌బోర్డు తగిలించేసరికి అడవంతా సందడి వ్యాపించింది. అక్కడ బిహారి ఒక కంప్యూటర్ సెంటరుని తన పేరు మీద ప్రారంభించాడు. 'కోతి బిహారి కంప్యూటర్ సెంటర్' అంటే కెబిసిసి సైన్‌బోర్డు కింద రాసి ఉంది. "రిజిస్ట్రేషన్ తెరచి ఉంది"... దానితో సాయంత్రానికల్లా రిజిస్ట్రేషన్ చేయించేవారి పెద్దలైన్ ఏర్పడింది. ఇందులో ఎక్కువగా జంతువులు-



పక్షులు, యువకులు, పిల్లలు ఉన్నారు.

బిహారి అడవిలోని పిల్లలకీ, యువకులకీ కాలుక్కులేటరు, మొబైలు ఫోను తెచ్చినప్పటి నుంచి అడవంతా విప్లవం వచ్చినట్లయింది. మొబైలుఫోను దొరకడం వల్ల అడవిలోని జంతువులన్నింటికీ ప్రమాదానికి అప్రమత్తమయ్యే సూచన లభిస్తూ ఉండేది. షేర్‌సింగ్ సింహం లేళ్ళ వేటకి బయలుదేరగానే అన్ని జింకలు, తెల్లచుక్కల లేళ్ళు ఆఖరికి కుందేళ్ళు కూడా షేర్‌సింగ్ ఎక్కడి నుంచి వస్తున్నాడో, ఒకరికొకరు వార్త నందించుకోసాగారు. ఫలితంగా షేర్‌సింగ్ చాలా రోజులవరకు ఆకలితో ఉండవలసి వస్తోంది. అందువల్ల షేర్‌సింగ్ మనసులోనే కోతి బిహారిపైన కోపంగా ఉంది.

అడవిలోని మరికొన్ని జంతువులు కూడా కోతి బిహారీ చేసిన పని బాగా లేదన్నాయి. కంప్యూటర్ల వల్ల మన పిల్లలు పాడైపోతున్నారని అన్నాయి. చిరుతపులి ఖాన్ మాత్రం దీనికి భిన్నంగా మాట్లాడింది. "మీరంతా ముసలివాళ్ళయిపోయారు. మీ బతుకు మీరు బతికేశారు. మీ అబ్బాయిలూ- అమ్మాయిలను వాళ్ళ బతుకెందుకు బతకనీయరు? వారిమీద మీ అభిప్రాయాలను ఎందుకు మోపుతున్నారు ఈనాడు కంప్యూటర్ మొత్తం ప్రపంచంలో విప్లవం తెచ్చింది. బిహారి కారడవిలో ఎలక్ట్రానిక్ వస్తువులు తెచ్చినప్పటి నుండి మనం ఎంత ధనికులమయ్యామో! షేర్‌సింగ్ వేటాడ్డం మానివేసి శాకాహారి కావాలి. మామూలుగా కూడా ప్రభుత్వం అడవిలో వేటాడటం చట్టం ప్రకారం నేరమని ప్రకటించింది. అందువల్ల సోదరులారా! మీ పిల్లలను కొత్త ప్రపంచంతోపాటు నడవనివ్వండి. జరుగుతున్నది మంచికే జరుగుతోంది" అన్నది. మరి కొన్ని వాదనల తరువాత ఆ సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది.

షేర్‌సింగ్ వేటాడటం మానేశాక నక్క ఖోఖల్ ఆకలితో మాడసాగాడు. ఎందుకంటే నక్క ఖోఖల్ సింహం ఎంగిలి చేసిన మాంసం తిని బతికేవాడు. వాడి గూండా కొడుకు జయకాల్ (అందరు వాడిని జె.కె.అనేవారు) కూడా తండ్రి తెచ్చినవి తిని హాయిగా ఉండేవాడు. ఇప్పుడు చాలా రోజుల నుండి పస్తులుంటున్నాడు. ఒకరోజు వాడు తన తండ్రి ఖోఖల్‌ని కోపగించుకున్నాడు. అప్పుడు ఖోఖల్ నక్క అన్నాడు. "నువ్వు ఏ బీహారి దగ్గర కంప్యూటర్ నేర్చుకునేందుకు వెళుతున్నావో అతడు మన నెం.1. అతడి పనులను ఆపకపోతే మనం తొందరలోనే చచ్చిపోతాం". నక్క జె.కె.కి విషయమేమిటో ఇప్పుడు అర్థమైంది. "అలా అయితే నేను కోతి బిహారికి జీవితంలో

© SCERT not to be republished

మరచిపోలేని గుణపాఠం చెబుతాను" అన్నాడు. మరునాడు జె.కె. పట్టణం వెళ్లి కోతి బిహారీ కంప్యూటర్లను నాశనంచేసే వైరస్ ఉన్న ఫ్లాపీ తెచ్చాడు. కానీ కొండముచ్చు 'కాలూ' దీన్ని పసిగట్టి బిహారికి చెప్పింది. జయకాల్ బండారం బయటపడింది.

బిహారి సెక్యూరిటీ గార్డులు అతడిని ఎంతగా చితక్కొట్టారంటే, అతడు చాలారోజులవరకు తన గుహలో పడుండి కేకలు పెడుతుండేవాడు.

బిహారిని ఎలాగైనా దెబ్బతీయాలని జయకాల్ మళ్ళీ పట్టణానికి వెళ్ళాడు. అక్కడ మల్లిక్ సైబర్‌కెఫేలో దూరాడు. వారి గురించి తెలుసుకోవాలనిపించి, "ఇంటర్నెట్ అంటే ఏమిటి?" అని అడిగాడు.

"ఇంటర్నెట్ ఒక రకంగా ప్రపంచవ్యాప్తంగా ఉండే కంప్యూటర్ల నెట్‌వర్కు. ఇది ప్రజలకి ఒకరికొకరు సూచనలు ఇచ్చిపుచ్చుకోవడంలో సాయపడుతుంది. కంప్యూటర్‌లో ఇంటర్నెట్ ద్వారా మీరు ఎన్నో వెబ్‌సైట్ల నుండి సమాచారాన్ని పొందవచ్చు. ఎవరితోనైనా మాట్లాడవచ్చు. స్నేహం చేయవచ్చు. అని చెప్పాడు షాపు యజమాని మల్లిక్. 'మరి సైబర్‌కెఫే అని రాశారే!' మళ్ళీ అడిగాడు జయకాల్.

"ఓ అదా! సైబర్ అన్న పదం సైబర్‌నెటిక్స్ నుంచి వచ్చింది. దీని అర్థం- యంత్రాలు, జీవంగల ప్రాణులు రెండింటిలో సమాచారం మరియు స్వయంగా నడిచే నియంత్రణ ప్రణాళికకు సంబంధించిన శాస్త్రం. దీనితో ఇంటర్నెట్‌లో సంచరించడానికి తీసుకున్న పదం సైబర్ అర్థమైందా?" "మరి కేఫే అంటే?" "దీనిని కాఫీ హౌసు అంటారు. అంటే ప్రజలు కాఫీ హౌజ్‌కు వెళ్ళి బాతాఖానీ కొట్టినట్టే, కొందరు కంప్యూటర్ గురించి మాట్లాడ్డం, బాతాఖానీ, సూచనల నిచ్చిపుచ్చుకోవడం మొదలైనవి చేస్తారు. అందువలన వేటిని కేఫే అంటే సైబర్ కేఫే అని అంటారు" అన్నాడు మల్లిక్. బిహారీని ఓడించడానికి ఇదే సరైన మార్గమని భావించి 'జయకాల్ సైబర్ కెఫే' మొదలుపెట్టి సరిగా నడపలేక మళ్ళీ చేతులు కాల్చుకున్నాడు జయకాల్.

కానీ గుంటనక్క జయకాల్ తన కుటిల ప్రయత్నాలు మాత్రం మానుకోలేదు. తను కూడా కొన్ని తెలివితేటలు సంపాదించి 'www. లకీఆజ్ వికె.కామ్' పేరుతో ఓ వెబ్‌సైట్ మొదలు పెట్టాడు. కారడవి సమాచారాన్ని అడవిదొంగలకు పెద్ద మొత్తాలకు అక్రమంగా అందించడం మొదలుపెట్టాడు. దీనివల్ల కారడవిలో ఐదు ఏనుగులు వేటగాళ్ళ తుపాకీలకు బలైపోయాయి. జంతువులన్నీ బిహారి దగ్గరకొచ్చి "నీవల్లే ఇదంతా జరిగింది. కంప్యూటర్లు వద్దని మొత్తుకున్నా వినిపించుకోలేదని" నిందించాయి. బిహారి వారిని శాంతపరిచి ఈ రహస్యాన్ని ఛేదిస్తాను. భయపడవద్దని హామీ ఇచ్చాడు.

మరుసటిరోజు పట్టణంవెళ్లి అక్కడే మూడురోజులుండి తిరిగి వచ్చాడు.

పట్టణం నుంచి బిహారి ఎంతో చాతుర్యంగా పాస్‌వర్డ్ డిటెక్టర్ సాఫ్ట్‌వేర్ తీసుకొని వచ్చాడు. ప్రతి వెబ్‌సైట్‌లో ఒక పాస్‌వర్డ్ అంటే ఒక రహస్యసంకేతం ఉంటుందని అతనికి తెలుసు. దానిద్వారా వెబ్‌సైట్‌లో ఏదైనా వివరాన్ని పెట్టవచ్చు లేదా తొలగించవచ్చు. ఆ సాఫ్ట్‌వేర్ సాయంతో బిహారి జయకాల్ వెబ్‌సైట్ పాస్‌వర్డ్‌ని కనిపెట్టాడు. తరువాత వెబ్‌సైట్ తెరిచి వివరాలన్నీ తారుమారుచేసేసి వెబ్‌సైట్‌ని హైజాక్ చేశాడు. అతడికి తెలుసు తాను హైజాకింగ్ చేసి సైబర్‌క్రైం చేస్తున్నానని, కాని అందరి మంచికోరి చేసేపని నేరం కాదు.

జయకాల్ మరునాడు ఈ-మెయిల్ చెక్‌చేసినపుడు ఒక సందేశం ఇలా ఉంది. ముఖ్యమైన కొంత సరకు కావాలి. పోలీసులు జాగరూకులై ఉన్నారు. కలిసిన తరువాతే మాట్లాడుకుందాం. అమెరికన్ డాలర్లలోనే చెల్లిస్తాను.

ఎప్పుడు ఎక్కడ కలుస్తావో వెంటనే చెప్పు. పంపినవారు బీబీ @ హాట్ మెయిల్.కామ్. ఇది ఎవరో దొంగరవాణా కోసం వేటాడే వాడి సందేశంలా ఉంది. జయకాల్ జవాబు పంపాడు. "సోమవారం– రాత్రి ఒంటిగంట. నల్లనది పాత మర్రిచెట్టు" పంపినవారు 'లకీఆజ్@ వీకె యాహూ.కామ్.'


మరునాడే సోమవారం రాత్రి జయకాల్ తన గుహనుంచి బయలుదేరాడు. మెల్లమెల్లగా, జాగ్రత్తగా నడవసాగాడు. అడవి నిశ్శబ్దంగా ఉంది. చాలాసార్లు జయకాల్ తన కాలికిందపడి నలిగిన ఎండుటాకుల చప్పుడుకే ఉలికిపడ్డాడు. మర్రిచెట్టును సమీపించడానికి ముందు జయకాల్ నాలుగువైపులా పరిశీలించి చూశాడు. అంతా సరిగానే ఉండటంచూసి మర్రిచెట్టు కిందికివెళ్ళి నిలుచున్నాడు.

హఠాత్తుగా, కోతి బిహారి చెట్టుమీద నుంచి దూకి, అక్కడికివచ్చాడు. జయకాల్ అతడిని చూస్తూనే గాభరాపడ్డాడు.

"వంచకుడా! నీ ఆటలింక సాగవు. ఏనుగుల హత్యలు చేయించింది నువ్వే. నీ వెబ్‌సైట్ దీనికి సాక్ష్యం". కోతి బిహారి అన్నాడు. జయకాల్ పరిగెత్తబోయాడు. కానీ అప్పటికీ షేర్‌సింగ్, చిరుతఖాన్, గజరాజసింగ్ మొదలైన జంతువులు వాడిని చుట్టుముట్టేశారు. కోపంగా ఉన్న గజరాజ్‌సింగ్ జయకాల్‌ని తొక్కెయ్యడానికి తన కాలు పైకెత్తాడో, లేదో ఇంతలో ముసలి నక్క ఖోఖల్ అతడి కాలుపట్టుకుని, "నా ముసలి తనంలో వీడే నా ఆసరా. వీడిని విడిచిపెట్టండి' అంటూ బతిమాలుకోవడం మొదలుపెట్టాడు. జయకాల్ బాగా తన్నులు తిని ఉన్నాడు. షేర్‌సింగ్ అన్నాడు 'సరే, వీడిని వదిలెయ్యండి. కానీ వీడు ఇంక ఎప్పుడూ కారడవిలో కనబడకూడదు." మరునాడు బిహారి పోలీసులకి చెప్పి జయకాల్ వెబ్‌సైట్‌ని మూయించేశాడు.

ఒకరోజు అడవిలోని జంతువులన్నీ టివీలో ఒక సంచలన వార్త చూశాయి. పులులు, తోడేళ్ల ఇరవైఅయిదు చర్మాలతోపాటు వాటి దొంగరవాణా చేసే అయిదుగురిని పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. అడవికి రాజైన షేర్‌సింగ్ మరునాడు ఉదయం పేపరు వచ్చినపుడు మొదటిపేజీలో ఆ వార్తనంతటినీ పూర్తిగా చదివాడు. అది అతన్ని కలవరపరచింది. అతడు గుహనుండి బయల్దేరి తిన్నగా బిహారి కంప్యూటర్ సెంటరుకి వెళ్ళాడు. ఇలాంటి విషయాలలో బిహారి తెలివిగా సలహా ఇస్తాడని షేర్‌సింగ్‌కి తెలుసు.

"ఇదేవిధంగా పులులు, తోడేళ్ళ హత్యలు జరుగుతూపోతే పులివంశం అంతరించడానికి ఎంతోకాలం పట్టదు. డయనోసర్ లాగానే ప్రజలు ఎపుడో పులులు భూమిమీద అడవులలో



© SCERT not to be republished

ఉండేవి అని పుస్తకాలలో మాత్రమే చదువుతారు" అని షేర్‌సింగ్ అన్నాడు.

"అంతర్జాతీయ స్థాయిలో ఈ సమస్య గురించి ఆలోచించాలి. ప్రపంచంలోని ఇతర దేశాల పులులు, సింహాలను కూడా ఈ పనిలో చేర్చుకోవాలి. అప్పుడే ఈ సమస్య గురించి అందరూ గంభీరంగా ఆలోచిస్తారు" అని ఈ సమస్యకు పరిష్కారం చెబుతూ బిహారీ అన్నాడు. "కాని, ఇతర దేశాల పులులు, సింహాలతో మాట్లాడటం ఎలా జరుగుతూంది?" షేర్‌సింగ్ అడిగాడు.

"ఇంటర్నెట్ ద్వారా" బిహారి అన్నాడు.

"అదేమిటి?" షేర్‌సింగ్ ప్రశ్నించాడు.

అప్పుడు బిహారి ఇంటర్నెట్‌లోని అన్ని సౌకర్యాల గురించి వివరించాడు. షేర్‌సింగ్ ఇతర దేశాల పులులతో ఏ విధంగా చాట్ (సంభాషణ) చేయగలడో కూడా చెప్పాడు. షేర్‌సింగ్ ఛాట్ చేయడానికి సిద్ధపడ్డాడు. కోతి బిహారి ఇంటర్నెట్‌లో షేర్‌సింగ్‌తో ఛాట్‌చేసే ఆహ్వానాన్ని ప్రసారం చేశాడు. నిర్ణీత తేదీన నిర్ణీత సమయానికి షేర్‌సింగ్ బిహారి కంప్యూటర్ ఎదుట ఛాట్ చేయడానికి కూర్చున్నాడు.

షేర్‌సింగ్ ఇంటర్నెట్‌లో ప్రపంచంలోని పులులన్నింటికీ నమస్కారం చెప్పాడు. చాట్ చేయడానికి వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపాడు. తరువాత అతడు పులులు, తోడేళ్ళు మొదలైనవాటిపై త్వరితంగా జరుగుతున్న హత్యలు, వాటి తోళ్ళ దొంగతనం, అంతర్జాతీయ మార్కెట్‌లో తోళ్ల గిరాకి మొదలైన సమస్యలను ప్రస్తావించాడు. సింహాల జాతి అంతరించిపోయే ప్రమాదం ఏర్పడిందన్న విషయంపై తన ఆవేదన తెలిపాడు.

ఆఫ్రికా సింహం సందేశం వచ్చింది. "ప్రపంచ వన్యజీవుల సంరక్షణ నుంచి సాయం ఎందుకు తీసుకోరు?"

షేర్‌సింగ్ : "ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ ప్రభుత్వ యంత్రాంగంలో చిక్కుకుని ఈ పనులు ఆగిపోతున్నాయి."

మలేషియా సింహం. "మా అడవులలో చాలా ఖాళీస్థలం ఉంది. మీ పులులు, తోడేళ్లు అన్నీ మా ఎయిర్‌లైన్స్ విమానంలో కూర్చుని వచ్చేయండి. రాజకీయ రక్షణ దొరుకుతుంది."

చైనా నుంచి ఒక పులి : 'ఎన్ని పులుల కోసం బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు పంపమంటారో చెప్పండి. నాయకుల్లాగ మీరు కూడా మీ రక్షణ ప్రయత్నాలు ఎందుకు చేసుకోరు? మీకు కావాలంటే మేము మీలో కొందరికి కమెండోల ట్రైనింగు ఇప్పిస్తాం."

షేర్‌సింగ్ మలేషియా, చైనా పులులు ఇచ్చిన సలహాలకి ఆలోచించి సమాధానం ఇస్తానని చెప్పాడు. అమెరికాలోని ఏదో జూ నుంచి ఒక పులి సందేశం పంపింది. "మా సలహా ఏమిటంటే జాతిని రక్షించడం అవసరం. దీనికోసం అమెరికా శాస్త్రవేత్తలతో ఎందుకు మాట్లాడకూడదు? వారు క్లోనింగ్ ద్వారా పులులు, తోడేళ్ళ కొత్తజాతిని పుట్టించి పూర్తిసైన్యాన్ని తయారుచేస్తారు."

షేర్‌సింగ్‌కు క్లోనింగ్ అంటే అర్థంకాలేదు. కోతి బిహారి చెప్పాడు. "ఏదైనా ప్రాణి నుంచి ఒక ప్రత్యేక జీన్‌ని వేరుచేసి దానిని మరొక ప్రాణి కోశంలో చేరుస్తారు. ఈ విధంగా ఆ జీన్ కొత్త ప్రాణిలో పాతప్రాణియొక్క కొన్ని ప్రత్యేక లక్షణాలని కలుగజేస్తుంది. 'డాలీ' అనే గొర్రె ఈ విధంగానే పుట్టింది."

"ఏమన్నావు? గొర్రెల్లాగా సింహాలను పుట్టిద్దామనుకున్నావా?" షేర్‌సింగ్ చికాగ్గా ప్రశ్నించాడు.

తరువాత షేర్‌సింగ్, అమెరికాపులి మధ్య ఈరకంగా సంభాషణ జరిగింది. "అవి నిజం సింహాలవుతాయా?"

"పూర్తిగా నిజమైనవే. ఆకారం,పని, అలవాట్లు అన్నీ సింహంలాగే ఉంటాయి."

“వీటిని ఎవరు పుట్టిస్తారు? వీటి తల్లి ఆడసింహమే అవుతుందా?”

“రాబోయేకాలంలో ఆడసింహం అవసరం కూడా ఉండదు. అంతా టెస్ట్‌ట్యూబ్‌లోనూ, ప్రయోగశాలల్లోనూ అయిపోతోంది.”

“ఏమన్నావు? ఆడసింహం లేకుండా కూడా పుడతాయా? కాని అప్పుడు వాటిని సింహం పిల్లలని ఎలాగ అంటారు? వాళ్ళెలా అనగలరు. మేము సింహం పాలుతాగామని నీకు తెలియదా, మేము జాతి సింహాలం. మాకు పూర్తి వంశసంప్రదాయం ఉంది.”

“ఈ పాతమాటలన్నీ మరచిపో, ప్రపంచం మారిపోతూంది. శాస్త్రవేత్తలు, మనుషుల జాతిని కూడా మార్చబోతున్నారు.”

షేర్‌సింగ్ కోపంతో అరిచాడు. “నాకక్కరలేదు క్లోనింగ్ సింహం”.

“క్లోనింగ్ సింహాలను పుట్టించి నేను భారతదేశం సింహాలను అవమానం చేయను. నువ్వు చూస్తూ ఉండు, నేను తొందరలోనే ఇక్కడి అన్ని సింహాలను ఒకచోట చేర్చి, వారిని రక్షించడానికి ఒక ప్రణాళికను తయారుచేస్తాను. మేము సింహాలం మరి” కోతి బిహారి కంప్యూటరు సెంటరు నుంచి బయటికి వచ్చి ఎంత గట్టిగా గర్జించాడంటే. పూర్తి అడవికి తెలిసిపోయింది రాజు అతడేనని.

* * *

జయకాల్ పెద్దన్న మైకాల్ పరమక్రూరుడు. జయకాల్ కొన్నాళ్ళు అతనితో కలసి కారడవికి ద్రోహం చేద్దామని చూశాడు. ఆ ఎత్తుగడలేవీ ఫలించలేదు.

ఒకసారి మైకాల్ కారడవిని మట్టుపెట్టడంలో సొంత తమ్ముడి ప్రాణాలు తీయడానికి కూడా వెనుకాడలేదు. ఈ సంఘటన జయకాల్ కన్ను తెరిపించింది. అతడికి జన్మస్థలమైన కారడవిపై ప్రేమకూడా పెరిగింది. మనసు మారిన జయకాల్ షేర్‌సింగ్, బిహారీ మొదలైనవారిని శరణువేడి తిరిగి కారడవిలోకి ప్రవేశించాడు.

జయకాల్ తన దుష్టస్వభావాన్ని వదిలిపెట్టి అడవికి పనికివచ్చే పనులు చేయసాగాడు. అతడి ఏకాగ్రతని చూసి కోతి బిహారి సలహాతో జయకాల్‌ని అడవికి సమాచారమంత్రిగా చేశారు. జయకాల్ సలహాతో అడవిలో రేడియో స్టేషను, టివిస్టేషను ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి జంతువులు కారడవిలో మొబైలు ఫోనుతోపాటు, పాకెట్ ట్రాన్సిస్టర్లని కూడా పట్టుకుని తిరగసాగారు. తుఫాను, వరదలువంటి వాతావరణం సూచనలు తెలియడంవలన వారికి చాలా లాభమైంది. వేసవికాలంలో మండుతున్న ఎండలో చెట్టునీడన కూర్చుని పాటలు వినే ఆనందం దొరికింది. చలికాలపు సుదీర్ఘ రాత్రుళ్ళలో టెలివిజన్ సినిమాలు చూసే ఆనందం పొందసాగారు.

జయకాల్ తాను ప్రసారంచేసే కార్యక్రమాలు మనోరంజకంగా, ఉత్తేజంగా ఉండేలా చేయడానికెప్పుడూ సతమతమవుతూ ఉండేవాడు. అప్పుడే అతనికి ఒక ఆలోచన తట్టింది. అతడు జర్మనీ, జపాను, చైనా, అమెరికా వంటి ఎన్నో దేశాలకు ఉత్తరాలు రాసి, వారు తమ దేశాల్లో సర్కసుల్లో బంధించిన జంతువులను విడిచిపెట్టి కారడవికి పంపమని విన్నవించుకున్నాడు. వారు మా గౌరవనీయ కళాకారులు. వారు ఇక్కడ మా ప్రసార కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ పనికి జయకాల్ ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణకు చెందిన సంస్థల సహకారం కూడా అడిగాడు. జయకాల్ విన్నపానికి ప్రపంచంలోని అన్ని దేశాలవారు సహకారం అందిస్తామని ఉత్తరాలు రాయసాగారు. ఎందరో పర్యావరణవేత్తలు అతనికి అభినందనలు చెబుతూ ‘ఇది చాలా మంచిపని అనీ, దీనికి సాయపడ్డానికి తాము సిద్ధంగా ఉన్నామని’ సందేశాలు పంపారు.

నేను ప్రపంచదేశాలకి నా ధన్యవాదాలు తెలుపుతున్నాను. వారు నా విన్నపంతో సర్కసు జంతు కళాకారులను కారడవికి పంపుతున్నారు. మీరంతా తొందరలోనే వాటి కార్యక్రమాలని కారడవి రేడియో, టివిలలో వినవచ్చు. చూడవచ్చు" అన్నాడు జయకాల్.

కారడవి టి.వి,లో అన్ని సర్కసులనుంచి వచ్చిన సింహాలు, ఎలుగుబంట్లు, కోతులు, పక్షులు తమ మనోహరమైన విన్యాసాలను చూపించసాగారు. నృత్యాలు, సంగీతం, నాటకం మొదలైన కార్యక్రమాలు కూడా ప్రసారమవుతూ ఉండేవి. ఆ టి.వి ఛానెల్ తొందరలోనే జనుల ప్రియమైన ఛానెల్ అయిపోయింది. అన్ని దేశాలవారు దీనిని చూడసాగారు.

కారడవి టివి చానెల్ జనప్రియ ఛానెల్‌గా మారడానికి మరొకకారణం- దీనిలో కార్టూన్ చిత్రాల కథలు సజీవంగా చూపబడేవి. ప్రపంచంలోని పిల్లలందరూ దీనిని ఇష్టపడేవారు. ప్రపంచంలోని అనేక పర్యావరణ విద్వాంసులు కూడా దీనిని ప్రశంసించేవారు. ఎందుకంటే ఈ ఛానెల్ వన్య జంతువుల భద్రత, వివిధరకాల జంతువుల నుంచి రక్షించుకోవడానికి సంబంధించిన వివరాలు తెలియజేసేది. దీనిలో ఒక వార్తాబులెటిన్ కూడా ప్రసారం చేయబడేది. దీనిలో ప్రపంచంలోని వన్యప్రాణుల నేటిపరిస్థితి, వాటిమీద జరుగుతున్న అత్యాచారాల వాస్తవకథలు ప్రసారమవుతూ ఉండేవి.

కారడవి వెబ్‌సైట్, కారడవి టి.వి, ఛానెల్, కోతి బిహారి కంప్యూటర్ సెంటర్ మొదలైనవాటితో కోతి బిహారి కారడవి ప్రతిష్ఠని మరింత పెంచాడు. ఇప్పుడు కారడవి ప్రపంచంలోని అడవులన్నింటికీ ఆదర్శవంతమైన అడవి. దీని వెనుకనున్న ముఖ్యపాత్ర కోతి బిహారీయే.

www. కారడవి.కామ్.

నేషనల్ బుక్‌ట్రస్ట్

© SCERT not to be republished

## I) కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

(1) బిహారి అడవిని ఎలా అభివృద్ధి చేశాడు.

(2) అడవిని అభివృద్ధి పరచటంలో బిహారికి ఎదురైన ఆటంకాలేవి?

(3) క్లోనింగ్ అంటే ఏంటి? దాని వల్ల లాభమా? నష్టమా? చర్చించండి.

(4) బిహారీకి కంప్యూటర్ జ్ఞానం చాలా వుంది కదా? ఆ విషయాలు మీకు ఏమేరకు తెలిసాయి? ఈ పాఠంకంటే ముందు మీకు తెలిసిన విషయాలు ఏమిటి?

# వేసవి సెలవుల్లో



ఏప్రిల్ 24.

పరీక్షలైపోయి మూడు రోజులైంది.

దోస్తులు చాలా మంది ఊళ్లకు వెళ్ళిపోయారు.

క్రాంతి కూడా తాతయ్య వాళ్ళ ఊరికిపోతానంటే వాళ్ళ నాన్న ఒప్పుకోలేదు.

క్రాంతి వాళ్ళనాన్న చంద్రశేఖర్. బ్యాంకు ఉద్యోగి. పేరులో చంద్రుడున్నా ఎప్పుడూ సూర్యునిలా చిటపటలాడుతూనే ఉంటాడు. అందుకే నాన్నంటే క్రాంతికి భయం. అందుకు తగ్గట్టు ఏదో తప్పు చేస్తూ దొరికిపోతూ ఉంటాడు. ఇంటికి వెళ్ళేటప్పటికి వాళ్ళ మామయ్య శ్రీను కనిపించాడు. ఎప్పుడూ అయితే సంతోషంగా చుట్టుకునేవాడే కాని ఇప్పుడున్న పరిస్థితిలో పిసరంత నవ్వుతో సరిపెట్టుకోవలసి వచ్చింది. కాళ్లుచేతులు కడుక్కుని అన్నం తినేందుకు కూర్చున్నాడు బుద్ధిమంతుడిలాగ.

"వీడితో చచ్చే చావొచ్చిందిరా! ఒక్క క్షణం ఏమారితే చాలు ఎక్కడికో పారిపోతాడు...." వడ్డిస్తూ శ్రీనుతో అంది క్రాంతి వాళ్ల అమ్మ భారతి.

అమ్మ తన గురించి అట్లా చెప్పడం బాధ కలిగించింది క్రాంతికి. నోట్లో ముద్ద గొంతు దిగడానికి మొరాయించింది.

"ఫస్ట్ నుండి స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులకి, మ్యాథ్స్ ట్యూషన్‌కి పంపించాలనుకుంటున్నాను. ఈ వెధవ వాటికి కూడా దుమ్మా కొట్టి ఆటలాడేందుకు వెళ్ళేటట్టున్నాడు. ఇట్లా అయితే వీడి మొహానికి ఫస్ట్‌క్లాస్ సంగతి పక్కన పెట్టు కనీసం పాసైనా అవుతాడా?" అంతెత్తున ఎగిరాడు చంద్రశేఖర్.

"పోనీలే బావా! సెలవులే గదా! నాలుగురోజులు మా వద్ద ఉంటాడు. "ఏదో చెప్పబోయాడు శ్రీను. మామయ్య మాటలు గాయానికి వెన్న రాసుకున్నంత హాయిగా అనిపిస్తున్నాయి క్రాంతికి.

"నీకేమిటోయ్! నువ్వట్లాగే అంటావ్. వేలు వేలు ఖర్చు పెడుతున్నాం తెలుసా. ఈ వెధవ నిర్వాకానికి ఎన్ని ఫీజులు దండగ అవుతున్నాయో, నీకేం తెలుసు. వెధవని ఎక్కడికీ వెళ్లనిచ్చేది లేదు" చంద్రశేఖర్ మాటల్లో మంట తగ్గలేదు.

అన్నం చేదుగా అనిపించింది క్రాంతికి. సెలవుల్లో అమ్మమ్మ వాళ్ల ఊరికెళ్ళవచ్చని ఎన్నెన్ని కలలుగన్నాడో!

"బావగారూ! మా దగ్గర ఇంగ్లీష్, లెక్కలు చెప్పగలిగే మంచి మాష్టారున్నాడు. క్రాంతిని నా వెంట పంపండి. సెలవులు ముగిసే సరికి ఎంత మార్పొస్తుందో చూస్తే మీరే ఆశ్చర్యపోతారు. వచ్చే సంవత్సరం తొమ్మిదో తరగతికి వస్తాడు. అప్పుడు మీరెట్లాగైనా పంపరు. వాడికి ఇదే చివరి అవకాశం గదా...!" అంటూ ఎన్నో రకాలుగా నచ్చజెప్పాడు శ్రీను.

"ఊ! నీ ఇష్టం..." చంద్రశేఖర్ సీరియస్‌గా అన్నాడు. అదంతా ఇంకా నమ్మలేనట్లుగానే ఉంది క్రాంతికి.

ఆ అయోమయంలోనే అమ్మమ్మ వాళ్ల ఊరు చింతకుంట చేరుకున్నారు.

మరీ పల్లెటూరు కాకపోయినా చింతకుంట చిన్నదే.. చుట్టూ కొండలు, తాటి చెట్లు, ఇళ్లముందు వసారాలు, బయట అరుగులు, కుయ్.. కుయ్‌మంటూ తిరిగే కుక్కపిల్లలు, కోళ్లు... కోడిపిల్లలు, ఇంటి చూర్ల మీద కిచకిచలాడే పిచుకలు. పెరట్లో చెట్టుమీది నుంచి కిందకీ, కింద నుంచి పైకీ ఉరుకులాడుతున్న ఉడుతలు, నీళ్ళకోసం పరుగులు పెడుతున్న ఆడవాళ్ళు, గొంగళ్ళు భుజాన వేసుకుని పశువులను తోలుకెళ్తున్న పెద్దవాళ్ళు, చిన్న చిన్న లేగదూడలు..., బుజ్జి మేకలు... కొత్త ప్రపంచంలోనికి అడుగు పెట్టినట్లున్నది క్రాంతికి.

© SCERT not to be republished

ఊరికొచ్చిన రెండోరోజు. పొద్దున్నే లేచి వీధిలో గోళీలాడుకుంటున్న పిల్లల్ని చూస్తున్నాడు క్రాంతి. నలుగురు పిల్లలున్నారక్కడ. అతనికంటే కాస్త చిన్న వాళ్లు. చిరిగిన బట్టలతో మట్టి గొట్టుకుని పోయినట్లున్నారు. ఆట మధ్యలో అప్పుడప్పుడూ క్రాంతిని చూస్తున్నారు. ఏవో గుసగుసలాడుతూ నవ్వుకుంటున్నారు.

'ఆహా! స్వేచ్ఛ అంటే వాళ్లదే' తనను తాను మరచిపోయాడు. క్రాంతి.

"ఒరే క్రాంతీ...!" కేకేశాడు శ్రీను, పిట్టగోడ వెనుక నుండి.

ఉలిక్కిపడి లోపలికి వెళ్ళాడు క్రాంతి.

"ఏరా.. తెల్లారిందా? నాన్నేం చెప్పాడో గుర్తుంది కదా!" మెత్తగా మందలించి, పనున్నట్లు బయటికి వెళ్లిపోయాడు.


రామేశ్వరం పోయినా శనీశ్వరం తప్పలేదు అన్నట్లయింది క్రాంతి పరిస్థితి. "హూ! ఇక్కడా ట్యూషన్ల గొడవే' అనుకుంటూ నీరసంగా మొహం కడుక్కోవడానికి సిద్ధమైనాడు.

మొహం కడుక్కొని, స్నానంచేసి, అమ్మమ్మ వేడివేడిగ చేసి ఇచ్చిన జొన్న రొట్టె తిన్నాడు ఏదో ఆకుకూరతో.

అప్పుడే పొలం నుండి వచ్చిన తాతయ్య అడిగాడు క్రాంతిని "ఏరా తాతా! రొట్టె తిన్నావా? అది మీ అమ్మ పెట్టే ఇడ్లీలాగా, దోసెలాగా కమ్మగా ఉందా?" అని. క్రాంతిని వాళ్ల తాతయ్య ముద్దుగా "ఏరా తాత!" అని పిలుస్తాడు.

"తిన్నాను తాతయ్యా! ఇంత పెద్ద రొట్టె. మొత్తం తినేశా!" సంతోషంగా చెప్పాడు క్రాంతి.

వాడి వరుస చూసి భళ్ళున నవ్వేశాడు తాతయ్య. "ఒక్క రొట్టె తినడం గొప్పేమిటిరా? నీ వయస్సులో నేను మూడు రొట్టెలు తినేవాడిని.



అంతలో శ్రీను ఎవరినో కొత్త వ్యక్తిని వెంట పెట్టుకొచ్చాడు.

"ఒరే క్రాంతి! ఇదిగో ఈ సార్ పేరు రాఘవ. రోజూ వాళ్ళింటికి వెళ్లి చదువుకోవాలి. సార్‌కు నమస్కారం చెయ్యి" శ్రీను గొంతులో ఎప్పుడూ కనిపించే ప్రేమలేదు.

అంతసేపటి ఆనందం కరిగిపోయింది. యంత్రంలాగా చేతులు జోడించాడు క్రాంతి.

"హాయ్ క్రాంతి!" బుగ్గలు తడిమాడు రాఘవ. మరు నిమిషం కసాయి వాడి వెంట వెళ్తున్న బుజ్జిమేకలా రాఘవను అనుసరించాడు క్రాంతి. పుస్తకాల సంచితో.

అది పెద్దఇల్లు. ఇంటిముందు చాలా ఖాళీ స్థలం. రకరకాల పూలమొక్కలు. ఒకవైపు విరగబూసిన మామిడి చెట్టుకు అక్కడక్కడా పిందెలు అందంగా ఉన్నాయి.

"సార్.." ఏదో అడగబోయాడు క్రాంతి.

"సార్‌కాదు బాబాయ్" సవరించాడు రాఘవ.

ఆశ్చర్యంతో నమ్మలేనట్లు చూశాడు క్రాంతి.

"బాబాయ్! ఇవన్నీ ఏంపూలు?"

"ఇవన్నీ మంచి పూలు." జవాబిచ్చాడు రాఘవ.

అర్థంకాలేదు క్రాంతికి

"క్రాంతి! పూలైనా, మనుషులైనా రెండే రకాలు. మంచివారు చెడ్డవారు అని. కాని పూలు పుట్టినప్పటినుండి ఒకే లక్షణం కలిగి ఉంటాయి. మనుషులు అవసరాన్ని బట్టి మంచివాళ్ళుగా చెడ్డవాళ్లుగా మారిపోతుంటారు. కొందరు మాత్రమే ఏ పరిస్థితుల్లోనైనా మారకుండా మంచివాళ్ళుగానే ఉంటారు. వాళ్లనే మహాపురుషులు అంటాం."

ఆశ్చర్యానికి తోడు ఆనందంతో క్రాంతి కళ్ళు మెరిశాయి.

"లోపలికి రా! ఇంట్లో ఇంకా మంచి పూలున్నాయి."అంటూ లోనికి దారి తీశాడు.

అక్కడ ఒక అవ్వ వాళ్లకు రెండు చిన్న గిన్నెల్లో ఒకద్రవం పోసిచ్చింది. రాఘవ అది తాగుతూ పక్కనే మిరప పొడి, ఉప్పు చల్లిన మామిడి ముక్కలను నంజుకుంటున్నాడు.

ఇష్టం లేకున్నా అదేదో రుచి చూడాలని క్రాంతి కూడా అట్లాగే తాగాడు.

"దీన్ని అంబలి అంటారు. కొన్ని చోట్లలో జావ అంటారు. పట్టణాల్లో ఉండేవాళ్లు పాలల్లో కలుపుకునే మాల్టోవాలు బోర్న్‌వీటాలు కూడా వీటినుండి తయారయ్యేవే. దీనికోసం ఉపయోగించిన గింజలు రాగులు లేదా తైదలు" వివరించాడు రాఘవ.

"ఎంత బాగుందో" అనుకోకుండా ఉండలేకపోయాడు క్రాంతి. అక్కడి నుండి మరో గదిలోకి వెళ్లారు. గది చాలానీట్‌గా ఉంది. రెండు పెద్ద పెద్ద అద్దాల బీరువాలున్నాయి. వాటి నిండా పుస్తకాలు, గోడలనిండా మహాపురుషుల బొమ్మలున్నాయి. వివేకానందస్వామి, శివాజీ, రాణాప్రతాప్, గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, అంబేద్కర్, వీరేశలింగం పంతులు వంటి కొంతమందిని మాత్రమే గుర్తించగలిగాడు క్రాంతి.

'అవును! ఇంట్లో మంచి పూలున్నాయని చెప్పాడు బాబాయ్...' అనుకుంటూ పూలకోసం వెతకసాగాడు కళ్ళతోనే క్రాంతి.

"ఏంటి! పూలకోసం చూస్తున్నావా? నువ్వు చూస్తున్నవన్నీ మంచి పూలే. దేశంకోసం, ధర్మంకోసం, సమాజంకోసం తమ జీవితాలను పూజాపుష్పాలుగా సమర్పించిన వీళ్ళందరూ మంచి పూలే. ఒకప్పుడు నీలా ఆడుకుంటూ పాడుకుంటూ అల్లరి చేసినవాళ్ళే. వీళ్ళ గురించి తెలుసుకోవాలని ఉందా?"

"ఆ!" అన్నాడు క్రాంతి వెంటనే.

"సరే! అవకాశాన్నిబట్టి అన్నీ చెబుతాను. భోజనం టైం అయ్యింది కదా!" అన్నాడు రాఘవ.

"ఏంటి అప్పుడే మధ్యాహ్నమయ్యిందా? బడిలో పన్నెండున్నర అవటానికి ఎంతో ఎదురుచూడవలసి వచ్చేది..." అనుకుంటూ టెబుల్‌మీదున్న వాచ్‌వంక చూశాడు. ఒంటిగంట! 'అమ్మో!' అనుకుంటూ "మరి పాఠాలు?" అడిగాడు క్రాంతి.

"ఈ రోజు పాఠం అయిపోయింది గదా?" అనేశాడు రాఘవ.

నమ్మలేకుండా చూశాడు క్రాంతి.

"పాఠమంటే చదవటం రాయటం, లెక్కలు చేయటం మాత్రమే కాదు క్రాంతి! తెలియని విషయాలను తెలుసుకునేదంతా పాఠమే. ఈ రోజు మీ అమ్మమ్మ వాళ్ళింట్లో తిను, రేపటి నుండి ఇక్కడే నీ భోజనం..." చెప్పాడు రాఘవ.

అట్లా మొదలైన క్రాంతి వేసవి బడి రాఘవ వాళ్ళ ఇంట్లో సరదాసరదాగా సాగిపోతున్నది.

పుస్తకాలు లేకుండా చదువుచెప్పే ఈ పద్ధతి క్రాంతికి బాగా నచ్చింది. కథలు చెబుతూ, జోకులేస్తూ, చర్చిస్తూ ఎన్నో విషయాలు రాఘవ చెప్పేవాడు. లెక్కలు మాత్రం బుక్కులో చేసుకోవడం. అది కూడా ఎంతో ఇంట్రెస్టింగ్‌గా ఉండేది. ఒక వారం గడిచి ఉంటుంది.

హఠాత్తుగా ఒకరోజు క్రాంతీ! నీకు ఏ ఆట ఇష్టం?" ముద్దుగా చూస్తూ అన్నాడు రాఘవ.

"క్రికెట్!" టక్కున జవాబిచ్చాడు క్రాంతి.

"ఇంకా?"

"క్రికెట్!"

"క్రికెట్‌తోపాటు?"

"క్రికెట్!"

పగలబడి నవ్వేశాడు రాఘవ.

"బౌలింగ్ చేస్తావా?"

"ఓ!"

"ఏం బౌలింగ్?"

"ఫాస్ట్‌బౌలింగ్– శ్రీశాంత్‌లాగ!" చేయి తిప్పుతూ చెప్పాడు క్రాంతి.

"సరే! నీకో మంచి కోచ్‌ని పరిచయంచేస్తాను. కానీ ఒక్క కండీషన్. నువ్వు రోజూ ఉదయం ఎప్పటిలాగే ఇక్కడ చదువుకోవాలి. సాయంత్రం ఆటాడేందుకు వెళ్ళాలి."

"అలాగే!" చటుక్కున అన్నాడు క్రాంతి.

అలా కృష్ణస్వామితో పరిచయమైంది.

******

అతని పేరు కృష్ణస్వామి. అందరూ 'స్వామి' అని పిలుస్తారు. పెరిగిన గడ్డం, విరిగిన చేయి మినహాయిస్తే, సినిమా హీరోలా ఉంటాడు.

హైదరాబాదు తరపున రంజీట్రోఫీలో ఆడాడు. యాక్సిడెంట్‌లో చేయిపోగొట్టుకున్నా, ఆటమీద మోజు మాత్రం వదలలేదు. ద్రోణాచార్య అవార్డుకు తగినవాడు.

కృష్ణస్వామితో పరిచయం అయిన తర్వాత క్రాంతికి సమయమే తెలియడంలేదు. ఉదయం రాఘవ వాళ్ళింట్లో చదువు, సాయంత్రం కృష్ణస్వామి వద్ద క్రికెట్. అంతవరకూ గుడ్డిగా వికెట్లమీదికి బంతిని విసిరే క్రాంతి, ఆ పదిహేను రోజుల్లో చాలా విషయాలు తెలుసుకున్నాడు. ఏ ఆటకైనా శారీరకంగా 'ఫిట్'గా ఉండటం ఎంత అవసరమో గ్రహించాడు. వ్యాయామం, యోగా కూడా నేర్చుకోవడం మొదలుపెట్టాడు. అతని బౌలింగ్ చూసి అంతా అతనికి 'శ్రీ' అనే ముద్దుపేరు తగిలించేశారు. బౌలింగ్‌లోనే కాక బ్యాటింగ్‌లోనూ ప్రతాపం చూపించసాగాడు క్రాంతి.

ఆ రోజు కొంచెం ముందుగానే ప్రాక్టీసు మొదలుపెట్టారు. కాని, ఆట మొదలైన అరగంటకే బంతి బోరుబావిలో పడిపోయింది. ఎంత ప్రయత్నించినా ఇంకొక బంతిని తెచ్చుకోలేకపోయారు. ఆ పొలం యజమానిని తిట్టుకుంటూ బోరుబావినైతే మూసేశారుగానీ ఆట మాత్రం ఆగిపోయింది. చాలామంది నిరాశతో ఇంటికెళ్ళిపోయారు. క్రాంతికి బాగా దగ్గరైన నానిగాడు, ఆరిఫ్, రవి మాత్రం మిగిలారు.

అప్పుడు చంద్రం అనే ఒక పెద్దాయన ఒక కుర్రాడ్ని వెంటబెట్టుకొని అక్కడికి వచ్చాడు.

"చంద్రం ఈ రోజు మమ్మల్ని కూడా నీతోపాటు చెరువుకి తీసుకుపోతావా?" అడిగాడు కృష్ణస్వామి.

"దాందేం భాగ్యం? రండి తమ్ముడూ!" సంతోషంగా ఆహ్వానించాడు చంద్రం.

తామిప్పుడు గాలాలతో చేపలు పట్టేందుకు వెళ్తున్నామని, వాటిని ఎట్లా ఉపయోగిస్తారో వివరంగా చెప్పాడు కృష్ణస్వామి దారిలో. తలుచుకుంటేనే విచిత్రమైన అనుభూతికి లోనయ్యాడు క్రాంతి.

పదిహేను నిమిషాల్లో ఊరికి కొంచెం దూరంలో ఉన్న చిన్న చెరువు దగ్గరకు చేరుకున్నారు. చంద్రం తన చేతి సంచిలోనున్న చిన్న కవర్‌లో నుంచి వానపామును తీసి గాలానికి గుచ్చాడు. అతనితోపాటే వెంట ఉన్న చిన్నోడు ఆ పని చేశాడు. క్రాంతిని కూడా ఒక గాలానికి వానపాము గుచ్చి ఇచ్చి నీళ్ళలో తమలాగే వేయమన్నాడు చంద్రం.

కృష్ణస్వామి, నానిగాడు మాత్రం గట్టుమీద వీళ్ళకు కొంచెం దూరంగా చూస్తూ కూర్చున్నారు.

పూర్తి ఏకాగ్రతతో, నిశ్శబ్దంగా నీటిమీద ఉన్న తమ తమ బెండ్లనే గమనిస్తున్నారు ముగ్గురూ. ఇంతలో – 'ఝు...ష్! తువుక్కు'మనే శబ్దం వినిపించింది. అందరూ అటువైపు చూశారు. చిన్నోడు ఓ చేపను పడేశాడు.

సరిగ్గా అప్పుడే క్రాంతిగాలానికున్న బెండు కదలసాగింది. ఆ తర్వాత ఆ బెండు చుట్టూ గుప్పెడు బుడగలొచ్చాయి. అంతలోనే బెండు నెమ్మదిగా నీళ్ళలోకి మునిగిపోసాగింది. ఇంక ఆలస్యం చేయకుండా బయటికి లాగాడు.

అద్భుతం!

నల్లటి చేప బయటికొచ్చేసింది. అది కొర్రమీను పిల్ల. డాన్స్ చెయ్యాలన్నంత ఆనందం కలిగింది క్రాంతికి. కాని శబ్దం చేయకూడదన్న మాట గుర్తుకొచ్చి ఆగిపోయాడు. ఎంత అణుచుకుందామనుకున్నా ఆగని సంతోషం ఏవో వెర్రికేకల రూపంలో బయటపడింది.

* * *

"ఏమిట్రా ఈ వేళప్పుడొచ్చావ్? క్రికెట్ లేదా?" సాయంత్రం నాలుగ్గంటలప్పుడు కనిపించిన క్రాంతిని అడిగాడు రాఘవ.

"ఈ రోజే కాదు, నాలుగురోజుల దాకా ఏ ఆటలూ లేవు" సీరియస్‌గా అన్నాడు క్రాంతి.

"ఏం? ఎందుకు?"

"శ్రీహర్షతో పద్యాల పోటీ!"

"హఠాత్తుగా ఈ పోటీ ఎక్కడి నుండి పుట్టుకొచ్చిందిరా?" ఆశ్చర్యంగా అడిగాడు ఆయన.

"ఈ రోజు క్రికెట్‌లో నా బౌలింగ్‌లో మూడుసార్లు డకౌట్ అయ్యాడువాడు. దమ్ముంటే నాతో పద్యాల్లో గెలవమన్నాడు. 'సరే' అన్నాను. అవి మా పుస్తకాల్లోని పద్యాలు కాకుండా వేరే గ్రంథాల్లోవి ఉండాలి అన్నాడు. అందుకూ ఒప్పుకున్నాను. మీ మీద నమ్మకంతో" వివరించాడు.

"భలేవాడివే. నువ్వు గెలవడానికి నామీద నమ్మకం ఎందుకురా?"

"అదంతే!" అన్నాడు ఏం చెప్పాలో, ఎట్లా వివరించాలో తోచలేదు క్రాంతికి. బాబాయ్ చెబితే ఏదైనా నేర్చుకోవచ్చునని అతని నమ్మకం.

"ఇంతకూ ఏ గ్రంథంలోని పద్యాలు? ఎన్ని?" ఆలోచిస్తూ అడిగాడు రాఘవ.

"భాగవతం నుండి పన్నెండుపద్యాలు" చెప్పాడు క్రాంతి.

"ఊరికే కంఠస్థం చేస్తే చాలా?"

"కాదు, అర్థం, భావం చెప్పాలి."

"ఊ!.... నీవు సిద్ధమైతే నేను సిద్ధమే" అనేశాడు రాఘవ.

* * *

రేపే పద్యాల పోటీ.

పద్యాలన్నీ నేర్చుకున్నాడు క్రాంతి. తప్పకుండా గెలుస్తానన్న విశ్వాసంతో ఉన్నాడు. మరోపక్క శ్రీహర్ష కూడా పట్టుదలతో ప్రాక్టీసు చేస్తున్నాడు.

'తాతయ్యకు పద్యాలంటే చాలా ఇష్టం. కృష్ణరాయబారం, గయోపాఖ్యానం, రుక్మిణీ కల్యాణం, దక్షయజ్ఞం అంటూ పేర్లు చెప్పి పద్యాలన్నీ వినిపిస్తుంటాడు. తన పద్యాలన్నీ ఇప్పుడు వినిపించేయాలి' అనుకుంటూ రాత్రి పొలం కాపలా కోసం వెళ్ళిన తాతయ్యకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు క్రాంతి. అంతలో వచ్చాడు... నానిగాడు "ఈతకొట్టేందుకు వెళ్దాం రా అన్నయ్యా!" అంటూ.

"ఈ రోజుకి వద్దులేరా...!" బుజ్జగింపుగా అన్నాడు క్రాంతి మనసులో 'వెళ్తేబాగుండేది' అనిపిస్తున్నా.

"ఇంకా నువ్వుండేది మూడురోజులే గదా? తొందరగా వచ్చేద్దాం... రా" బతిమాలాడు నానిగాడు.



© SCERT not to be republished

‘అప్పుడే సెలవులు దగ్గరపడ్డాయా?’ అనుకుంటూ దిగులేసింది. ఇంకేమీ ఆలోచించకుండా వాడి వెంట బయలుదేరాడు. దారిలో అరుణ్, రవి కూడా కలిశారు.

గంటలో వచ్చేద్దామని బావికెళ్లినవాళ్ళు రెండుగంటలైనా అక్కడి నుండి కదలలేదు.

హఠాత్తుగా రేపటిపోటీ కోసం తయారుకావాలని గుర్తుకొచ్చింది క్రాంతికి.

“ఒరేయ్ నాని! ఇంక వెళ్దాం. పొద్దెంతైందో చూశావా?” హెచ్చరించాడు నానిగాణ్ని.

రవి, అరుణ్ కూడా బయటికొచ్చి బట్టలు మార్చుకునేందుకు సిద్ధమైనారు.

“ప్లీజ్ అన్నయ్యా! ఈ ఒక్కసారి పై మెట్టుమీద నుంచి దూకుతా!” అడిగాడు నానిగాడు.

వాడేమడిగినా కాదనడానికి మనసొప్పదు క్రాంతికి. “సరే! ఇదే లాస్ట్. కానీయ్! నేను బట్టలు మార్చుకుంటున్నా!” అన్నాడు.

“ఓకే!” సంతోషంగా అరుస్తూ, ఎనిమిదో మెట్టు పైకెక్కి గభాల్న దూకేశాడు నానిగాడు. కాని అప్పటికే నడుముకున్న ట్యూబ్ ఊడిపోయే స్థితిలో ఉన్నదని చూసుకోలేదువాడు. క్రాంతి, అరుణ్, రవిలకు ఏం జరుగుతున్నదో అర్థంచేసుకొనేటప్పటికి ట్యూబ్‌నీళ్ళమీద ఉంది. నానిగాడు లోపలికెళ్ళిపోయాడు. గుండె ఝల్లుమంది క్రాంతికి.

ఈలోపు నానిగాడు మరోసారి... మరోసారి... పైదాకా వచ్చి మునిగిపోయాడు.

క్షణాలు గడుస్తున్నాయి. నానిగాడు మునిగిన చోట గుత్తులు గుత్తులుగా బుడగలు వస్తున్నాయి. మరేమీ ఆలోచించకుండా గభాల్న నీళ్ళలోకి దూకేశాడు క్రాంతి. లోపల నీటి అడుగున నల్లగా, భయంకరంగా ఏదో కనిపిస్తున్నది. అది నానిగాడి జుట్టేనని అర్థమయ్యింది. గబుక్కున దాన్ని అందుకుని పైకొచ్చేశాడు.

మెట్లవద్ద రవి, అరుణ్ చేతులందించి, ఇద్దరినీ బయటకు లాక్కున్నారు.

పొట్టమీద నొక్కితే నీళ్ళు కక్కేశాడు. అరికాళ్ళు, అరచేతులు బాగా రుద్దారు. మెల్లగా కళ్ళు తెరిచాడు వాడు.

ఈ సంగతి ఎవరికీ చెప్పకూడదని నలుగురూ కూడబలుక్కుని, ఇళ్ళకు చేరుకున్నారు.

* * *

శనివారం సాయంత్రం.

ఆంజనేయస్వామి ఆలయం కిటకిటలాడుతోంది.

ఎప్పుడూ గుడికి వెళ్ళని వాళ్లు కూడా ఆ రోజు పిల్లల ప్రతిభ చూద్దామని అక్కడికి చేరుకున్నారు.

న్యాయనిర్ణేతలుగా మధుసూదనశాస్త్రి, అగ్నివేశ్, సయ్యద్ అమీముద్దీన్ కూర్చున్నారు.

మధుసూధనశాస్త్రి నియమాలు వివరించాడు. మధ్యలో ఆగిపోవడంగానీ, తత్తరపడటంగానీ ఉండకూడదని, భావయుక్తంగా, స్పష్టంగా చదవాలని, అన్ని పద్యాలు ఇద్దరూ సమానంగా చదివినా, చదివిన విధానాన్ని బట్టి ఫలితం చెప్పడం జరుగుతుందని చెప్పాడు. కార్యక్రమాన్ని ప్రారంభించవలసినదిగా అమీముద్దీన్‌ని కోరాడు.

ఆయన ‘శుక్లాంబరధరం...’ అంటూ ప్రారంభించగానే అందరూ ఆశ్చర్యపోయారు. ఆయన గొంతులో ఘంటసాల పీఠం వేసుకున్నట్లే ఉంది. చప్పట్లతో అభినందించారు అంతా.

అగ్నివేశ్ భాగవతంలోని ‘అడిగెదనని కడువడి జను’ అనే పద్యం చదివి అర్థం వివరించి పద్యం ఇట్లా స్పష్టంగా ఉండాలని తెలిపాడు. పోటీ ప్రారంభమైంది.

“చేతులారంగ శివుని పూజింపడేని...” అంటూ క్రాంతి చదవగానే అందరూ చప్పట్లు కొట్టారు. నానిగాడు, ఆరిఫ్ గట్టిగా కేరింతలు కొట్టారు.

తర్వాత శ్రీహర్ష ‘ఎవ్వనిచే జనించు..’ అనే పద్యం చదివి అందరి ప్రశంసలూ అందుకున్నాడు.

ఆ తర్వాత ఇద్దరూ పదేసి పద్యాలు ‘నువ్వా- నేనా?’ అన్నంత దీటుగా చదివారు. శ్రీహర్ష అంత బాగా చదువుతాడని క్రాంతి ఊహించలేదు. క్రాంతిని ఓడించడం తథ్యమనుకున్న శ్రీహర్షకూ ఓటమి భయం పట్టుకున్నది.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

"మీరిద్దరు సమఉజ్జీలుగానే ఉన్నారు. ఇప్పుడు మీకిష్టమైన పద్యాన్ని చెప్పండి!" చివరి అవకాశంగా అన్నాడు మధుసూధన శాస్త్రి.

ముందుగా శ్రీహర్ష "ఇంతింతై వటుడింతయై...." పద్యం చదివి వామనుడు త్రివిక్రముడుగా మారిన వైనాన్ని చక్కగా వివరించాడు. ఆలయ ప్రాంగణమంతా చప్పట్లతో మారుమోగింది.

తర్వాత క్రాంతి "కమలాక్షు నర్చించు కరములు కరములు..." అంటూ నెమ్మదిగా, అందులో లీనమై భక్తి, జ్ఞానాలు ప్రకాశించేట్లు చదివాడు. అర్థం వివరించనవసరంలేకుండానే ఆగని చెప్పట్లు. అర్థం వివరించిన తర్వాత మరిన్ని.

'పోటీలో ఎవరు గెలిచినా బాధలేదు. జీవితంలో ఇంత సంతోషం ఎప్పుడూ పొందలేదు' లోలోన పొంగిపోసాగాడు క్రాంతి.

'పోటీలో తనే గెలవాలి. లేకపోతే ఎంత అవమానం' కుంగిపోసాగాడు శ్రీహర్ష.

"ఫలితాలు చెప్పేముందు ఒక చిన్నమాట!" పాడాలని ఉంది కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యంలాగా గొంతు సవరించుకున్నాడు మధుసూధనశాస్త్రి.

"ఇద్దరూ చిచ్చరపిడుగులే! ఇద్దరికీ సమానంగా వచ్చాయి మార్కులు. కాని..."

అందరూ ఊపిరి బిగపట్టి వింటున్నారు.

"శ్రీహర్షలో లేని ఏకాగ్రత క్రాంతిలో ఉంది."

ఆ తర్వాత ఫలితం చెప్పనవసరంలేకపోయింది.

ఆనందంతో చిప్పిల్లాయి క్రాంతి కళ్ళు, బాధతో కన్నీళ్ళు సుళ్ళు తిరిగాయి శ్రీహర్షలో.

భాగవతాన్ని బహుమతిగా ఇచ్చాడు మధుసూదనశాస్త్రి.

"నేనొప్పుకోను. అంతా అన్యాయం!" ఏడుపందుకున్నాడు శ్రీహర్ష.

"తప్పు నాయనా! నువ్వు ఓడిపోలేదు. క్రాంతి నీకంటే మెరుగ్గా రాణించాడు అంతే!" అక్కున చేర్చుకుని మనవణ్ణి లాలించాడు మధుసూదనశాస్త్రి.


* * *

మే 30.

మరుసటిరోజే తిరుగు ప్రయాణం కావాలి క్రాంతి.

"హలో క్రాంతి! రేపేనా ప్రయాణం? మళ్ళెప్పుడొస్తావురా?'' పలకరించాడు ఆరిఫ్.

"రేపు నేను వెళ్లడం లేదుగా!" కళ్ళెగరేశాడు క్రాంతి.



"అవునా? అయితే రేపు సీతారాంపేటవాళ్ళతో మ్యాచ్ పెట్టుకుందామా?" అడిగాడు వెంటనే ఆరిఫ్.

అప్పటికే మిత్రులందరూ ఏవేవో కానుకలిచ్చారు. ఆరిఫ్ కూడా ఒక బ్యాటు తీసుకొచ్చాడు.

"అయితే ఆ బ్యాటుతో నువ్వు అదరగొట్టే సెయ్యాలి" తను తెచ్చిన బ్యాటును అందించాడు ఆరిఫ్.

"ఇప్పుడింత డబ్బు ఖర్చుచేసి ఎందుకు తెచ్చావురా?" మొహమాటపడుతూ తప్పదన్నట్లు తీసుకున్నాడు క్రాంతి.

మ్యాచ్ విషయం చెప్పడం కోసం మిగతా ఫ్రెండ్స్ దగ్గరికి వెళ్ళాడు ఆరిఫ్.

"బాబు, క్రాంతీ! ఓసారి లోపలికి రా నాయనా?" నాని తల్లి పిలిచింది. ఆమె పేరు సునీత.

"ఏంటి పిన్ని?" అంటూ లోపలికి వెళ్లాడు క్రాంతి.

"క్రాంతి పెద్దవాడివైతే నీ కాళ్ళు కడిగి నెత్తిన చల్లుకునేదాన్నిరా! కానీ నువ్వు నా బిడ్డలాంటివాడివి. నీవే లేకుంటే నా బిడ్డ..." దుఃఖంతో సునీత గొంతు పెగలలేదు.

"అసలేవాడి తండ్రిని పోగొట్టుకున్నాను. వాడు కూడా పోయుంటే..."

ఆమె అట్లా మాట్లాడే సరికి క్రాంతికి కూడా ఏడుపొచ్చేసింది.

"బావి సంగతి ఎవరికీ చెప్పొద్దన్నాను గదరా" తిరిగి వెళ్తూ ఆరాతీశాడు క్రాంతి.

"నేను చెప్పలేదన్నయ్యా! అరుణ్‌వాళ్ళమ్మతో చెప్పాడట. ఆమె అమ్మకు చెప్పింది. అమ్మ నన్నడిగితే జరిగింది చెప్పాను" నిజం ఒప్పుకోక తప్పలేదు నానికి.

క్రాంతి చింతకుంటలో గడిపిన రోజులన్నీ చెప్పలేని మధురానుభూతులను మిగిల్చాయి. సంతోషం, బాధ, సాధించిన పనులతో కలిగిన ఆనందం. తల్లి లాంటి ఆ పల్లెను వదిలివెళ్ళవలసి వస్తుందన్న విచారం..... రకరకాల భావాలతో ఇంట్లోకి అడుగుపెట్టిన క్రాంతి కొయ్యబారిపోయాడు. ఎదురుగా నాన్న చంద్రశేఖరం! కుర్చీలో కూర్చుని ఉన్నాడు. తెలియకుండానే కాళ్ళు వణికాయి.

"ఏరా వెళ్దామా?" అడిగాడు ఎప్పటిలాగానే.

నోట మాటరాలేదు క్రాంతికి.

"నీ గురించి అన్నీ తెలిశాయిలే. ఇప్పుడే రానక్కర్లేదు. నాలుగు రోజులాగి రావచ్చు మీ అమ్మ, చెల్లితో సహా!"

తండ్రి ఏం మాట్లాడుతున్నాడో అర్థంకాలేదు వెంటనే క్రాంతికి.

అతని అనుమానాన్ని తొలగిస్తూ లోపలింట్లో నుంచి భారతి ముసిముసి నవ్వుల్తో బయటకు వచ్చింది.

"అన్నయ్యా!" అమ్మ కొంగుచాటు నుండి చెల్లి తొంగి చూసింది.

"అమ్మా!" రివ్వున పరుగెత్తి తల్లి కౌగిట్లో ఒదిగిపోయాడు క్రాంతి.

## I) కింది ప్రశ్నలకు సమాధానాలను రాయండి.

(1) చదువంటే కేవలం రాయటం చదవడమేనా? ఇంకా ఏ ఏ అంశాలను చదువులో చేర్చవచ్చు.?

(2) మీకిష్టమైన ఆట ఏది? ఎందుకు? దానివల్ల మీరు ఏం సాధించాలనుకుంటున్నారు?

(3) ఈ కథ చదివిన తర్వాత పద్యపఠనం మీద నీకు కలిగిన అభిప్రాయాలు తెలపండి

(4) మీ వేసవి సెలవులు ఎక్కడ గడపాలనుకుంటున్నారు ఎందుకు?

(5) ఆపదలు సంభవించినప్పుడు ఏ విధంగా ప్రవర్తించాలి.?

© SCERT not to be republished

## పద విజ్ఞానం

### అర్థాలు

(అ)

అంఘ్రులు = పాదాలు
అంధకారం = చీకటి
అంబుధి = సముద్రం
అక్షము = కన్ను
అఖండం = ఏకరూపం,ముక్కలుగాలేనిది
అధ్యక్షత = సభాకార్యక్రమాలను నడిపే ప్రధాన వ్యక్తి
అధిత్యక = కొండమీది నేల
అనలుడు = అగ్ని
అనిమిషనాథుడు = దేవేంద్రుడు
అనిలము,అనిలుడు = వాయువు
అనిర్వచనీయం = మాటల్లో చెప్పలేనిది
అనుభూతి = మనసులో పుట్టే భావం
అన్యులు = ఇతరులు
అభినయం = నటన
అభిముఖం = ఎదురు
అభీష్టం = కోరిక
అభ్యుత్థానం = ఎదురుగా వస్తున్నవారిని గౌరవించడానికి తాను కూర్చున్నచోటినుంచి లేవడం
అమరులు = దేవతలు
అమృతాంశుడు = చంద్రుడు
అరుణం = ఎరుపు
అవధులు = హద్దులు
అవ్యాజ = కపటం లేని
అశని = పిడుగు

(ఆ)

ఆగామి = రాబోయే
ఆయత = పెద్ద
ఆర్తవం = పూవు
ఆర్షసంప్రదాయం=ఋషులసంప్రదాయం
ఆవిష్కరణ=ప్రకటన,వెల్లడించడం, బయటకుతీయడం
ఆస్తరణం = పరుపు
ఆహ్వానం = పిలుపు

(ఇ)

ఇక్షుదండం = చెఱకు గడ
ఇడుములు = కష్టాలు
ఇతిహాసం = చరిత్ర
ఇనుడు = సూర్యుడు

(ఉ)

ఉక్కు = ధైర్యం?
ఉజ్జ్వల = బాగా వెలుగుఉన్న
ఉదధి = సముద్రం
ఉద్దేశం = గురి, లక్ష్యం, (ఉద్దేశించదగినది)
ఉప్పరము = ఆకాశం
ఉన్ముఖుడు = సిద్ధపడేవాడు
ఉపలము = రాయి
ఉరగము = పాము
ఉర్వి = భూమి
ఉల్క = నిప్పుకణం

(ఎ,ఏ)

ఎద = హృదయం
ఎరుక = జ్ఞానం, తెలుసు
ఏర్చు(ట) = దహించడం
ఏహ్యాభావం = అసహ్యం

(ఒ,ఓ)

ఒనర్చడం (క్రి) = చేయడం
ఓఢ్రము = ఒడిశా భాష

(క)

కంఠీరవం = సింహం
కటకటా! = అయ్యయ్యో
కదళి = అరటి
కడలి = సముద్రం
కపి = కోతి
కరము = చేయి
కరి = ఏనుగు
కరువలి = గాలి
క్షమ = ఓర్పు
కల్యాణం = పెళ్ళి
కాన = అడవి
కాయం = శరీరం
కార్ముకం = విల్లు
కాలగతి = కాలం గడవడం
క్ష్మాతలం = నేల పైభాగం, భూమి
క్షితి = భూమి
కుడ్యం = గోడ
కుతూహలం = ఆసక్తి
కుశము = దర్భ
కూటము = శిఖరం
కెళవు = దూరం
కేశాలంకరణ = వెంట్రుకలను అలంకరించడం = అందంగా తీర్చటం
కేసరి = సింహం
కొస = చివర
క్రోధం = కోపం
క్రోలు = తిను, తాగు

(ఖ)

ఖగం = పక్షి
ఖాద్యం = తినుబండారం (తినదగినది)

(గ)

గండశిలలు = కఠినమైన శిలలు
గమించు = పోవు
గలంబా = పూత
గాడి = రథము
గాడ్పు = గాలి
గిరి = కొండ
గుణం = స్వభావం
ఘర్మజలం = చెమట

(చ)

చంచల = చలించుచున్న
చంద్రిక = వెన్నెల
చవి = రుచి
చిరము = చాలాకాలం
చూడ్కి = చూపు
చెరుపు = కీడు

(జ)

జంకు(క్రి) = భయపడు
జంఘ = పిక్క
జట = శిఖ
జటిల = జడలున్న, దట్టమయిన, చిక్కులు పడ్డ
జనయిత్రి = తల్లి
జని = జన్మ, పుట్టుక
జలధార = నీటిధార
జిహ్వ = నాలుక
జీర్ణం = అరగటం
జోతలు = జోహార్లు

(ఝ)

ఝరి = ప్రవాహం

(ఢ)

ఢంకా = డప్పు (పెద్దది, పైన చర్మం కప్పి ఉన్నది)

(త)

తగరు = పొట్టేలు
తటము = ఒడ్డు
తనువు = శరీరం
తరంగం = కెరటం, అల
తరుణం = సమయం
తరుగుల్మాలు = చెట్లూ తీగెలు
తర్కం = వాదన
త్యజించడం = విడవడం, వదలడం

© SCERT not to be republished

త్వర = వేగం
తారక = నక్షత్రం
తిరునాళ్ళు = దేవతలకు చేసే పండగలు,ఉత్సవాలు
తుండం = పక్షిముక్కు
తుహినం = మంచు
తూష్ణీభావం = తిరస్కారం
తేటి = తుమ్మెద

(ద)

దరి = గట్టు
దగ్ధమైన = కాలిన
దండం = నమస్కారం, ఒక ఉపాయం
దర్పం = గర్వం
దస్తారా = కాగితాల బొత్తి
దానవులు = రాక్షసులు
దారుఢ్యం = దృఢత్వం,
దవాగ్ని = అడవులను దహించే అగ్ని
దాస్యం = బానిసత్వం
దాహం = కాలడం, కాల్చడం
దినకరుడు = సూర్యుడు

(ధ)

ధరాధరం = పర్వతం
ధరిత్రి = భూమి
ధారుణి = భూమి
ధోవతి = మగవారు కట్టుకొనే వస్త్రం

(న)

నందనుడు = కొడుకు
నభము = ఆకాశం
నయవంచన =నమ్మించిమోసంచేయడం
నలుకువడు = ముక్కలవడం
నవ్యము = కొత్తది
నిఖిలం = సమస్తం
నిర్గతము = బయటికి వచ్చినది
నిరుపమ = పోలికలేని
నివేశం = ప్రదేశం
నుతి = పొగడ్త
నొడివి – నుడివి = చెప్పి

(ప)

పంక్తి = వరస
పక్షం = రెక్క, పదిహేను రోజులకాలం
పచనం = వండటం
పటము = వస్త్రము
పడయుట = పొందడం
పణ్యారాలు = నాన బెట్టిన పప్పు,భక్ష్యం
పత్రికాప్రతినిధి = ఒక పత్రికలో ప్రచురించడానికి సమాచారం సేకరించేవాడు
పన్నిదం = పందెం
పనుపుట = ఆజ్ఞాపించుట
పరిక్లమించు= ఎక్కువగా శ్రమించు
పరిఘ = కందకం
పరిక్లవించు=కదులుతూ,పురోగమిస్తూ
పవనం = గాలి
పవనాశనులు = పాములు
పరేశాను = బెంగపడడం
పాకం = వంట
పాటవం = నైపుణ్యం
పాయుట = తొలగడం
పారావారం = సముద్రం
పావనం = పవిత్రం
ఫికరు = బెంగ, భయం
పుటభేదం = పట్టణం
పునీతం = పవిత్రం
పురుహూతుడు = దేవేంద్రుడు
పృథితయశం = ప్రసిద్ధి చెందిన కీర్తి
పెయ్యి = ఆడ దూడ
పెటారు = పెట్టె
పొరలడం = దొర్లడం

(బ)

బయలు = ఆవరణ లేని ప్రదేశం
బంధుల = బంధువుల
బూడాలు = బజ్జీలు
బృందం = సమూహం
బేడ = 12 పైసల విలువ
బొబ్బ = పెద్ద కేక

(భ)

భంగి = విధం, రీతి
భరోసా = నమ్మకం
భవం = పుట్టుక
భానుడు = సూర్యుడు
భూజము = చెట్టు
భూషలు = అలంకారాలు

(మ)

మదం = అహంకారం
మరకతం = మణి
మిరం = కారం, మిరియం
మలీద =బెల్లాలతో చేసే ప్రసాదం రొట్టె
ఘాడ్కి = లా(గ)
మారి = జబ్బు
మూకవిప్పు = చెదరగొట్టడం
మాసుక = నమూనా

(య)

యథార్థం = నిజం
యుగ్మం = జంట

(ర)

రకం = పన్ను, విధం
రంతు = క్రీడ
రజం = దుమ్ము
రయము = వేగం
రవం = ధ్వని
రాణ్మందిరాలు = రాణివాసాలు, రాజభవనాలు
రిపువు = శత్రువు

(ల)

లంఘించు = దూకడం, దుమకడం, దాటి వెళ్ళడం.

(వ)

వన్నె = రంగు, అందం
వప్రము = కోటగోడ
వల్మీకం = పుట్ట
వ్యయం = ఖర్చు
వల్వ = వలువకు రూపాంతరం, వస్త్రం
వాక్కు = మాట
వాతం = గాలి
వారిజం = తామరపూవు
వారి = నీరు
వారిధి = సముద్రం
వారిజాప్తుడు = సూర్యుడు
వారిజగర్భుడు = బ్రహ్మ
వాలం = తోక,
వ్యాప్తి = ప్రసిద్ధి కెక్కినది
విక్షిప్త = విదల్చబడిన, చెదిరిపోయిన, చంచలమయిన
వితత = విరివిగా ఉన్న, వ్యాపించిన
విరుతించే = ధ్వనించే
విలాపం = దుఃఖం
వివరం = రంధ్రం
విస్మరించి = మరచి
వెల్లివిరియు =ప్రవహించు, ఉబుకు
వైజయంతి = విష్ణుమూర్తి మెడలోని పూలదండ
వైదికులు = వేదాలు తెలిసినవారు
వైలక్ష్యం = విలక్షణత్వం
వంతు = పోటీ

(శ)

శయ్య = పరుపు
శరధి = సముద్రం
శరము = బాణం
శిథిలాలు = పాడైన నిర్మాణాలు
శిరోభాగం = శిరస్సు
శ్రవణం = వినడం, చెవి

© SCERT not to be republished

శ్రావ్యం = వినసొంపైన

**(ష)**

షరాబు = బంగారపు వ్యాపారి

**(స)**

సంధానిస్తూ = కూరుస్తూ
సంరావిస్తూ = మోగిస్తూ
సంస్కరణ = బాగు చేయడం
సమర్చనం = విశేషమైనపూజ
సముద్ధరణ = బాగు చేయడం
సహస్రం = వెయ్యి
స్వస్తి = మంగళం
స్రవంతి = నది
సుగుప్తం = బాగుగా దాచినది.
సామర్థ్యం = యోగ్యత
సుషిరాలు = రంధ్రాలు
సూత్రపట్టు = నూలిపోగు

**(హ)**

హరి = కోతి
హలం = నాగలి
హేమం = బంగారం
హుకుం = ఆజ్ఞ

## పర్యాయపదాలు

అంధకారం = తమస్సు, తిమిరం, ఆంధ్యం
అక్షములు = కన్నులు, నేత్రాలు, నయనాలు
అనలుడు = అగ్ని, హవ్యవాహనుడు, వహ్ని, హుతభుక్
అనిమిషులు = దేవతలు, సురలు, అమరులు, త్రిదశులు.
అభీష్టం = కోరిక, కాంక్ష, ఈప్సితం , ఆశ
అశని = పిడుగు, కులిశం, నిర్ఘాతము,
ఆర్తవం = పుష్పం, సుమం, కుసుమం, పూవు
ఇక్షు = రసాలము, కరటము, అంగారిక, చెఱకు
ఇనుడు = సూర్యుడు, రవి, ద్యుమణి, నభోమణి
ఇల = భూమి, పుడమి, ఉర్వి, అచల
ఉరగము = పాము, సర్పము, ఫణి, అహి
ఎద = హృదయం, మది
కంఠీరవం = సింహం, మృగరాజు, కేసరి, పంచాస్యం
కదళి = అరటి, రంభ, సప్తపర్ణము
కరము = చేయి, హస్తము, కేలు
కరి = ఏనుగు, హస్తి, గజము, ఇభము
కల్యాణం = పెళ్ళి, వివాహం, పరిణయం ,ఉద్వాహం
కృషి = ప్రయత్నం, శ్రమ
కాయం = శరీరం, దేహం, తనువు,
కార్ముకం = విల్లు, ధనుస్సు, చాపం
కేతనం = జెండా, టెక్కెము, పతాకం, ధ్వజం
కేలు = హస్తము, పాణి, చేయి
కూటము = గిరి, కొండ, నగం
ఖగం = పక్షి, విహగం ,పులుగు
గభాలున = వెంటనే, తొందరగా
గాడి = రథము, తేరు, స్యందనం
గాడ్పు = గాలి, కరువలి, వాయువు
గిరి = కొండ శైలం, అద్రి, పర్వతం
గేహం = ఇల్లు, గృహం, కేతనం,
జిహ్వ = నాలుక, రసన, కకుత
తట్ట = గంప, బుట్ట
తేటి = తుమ్మెద, భ్రమరం, ద్విరేఫం, మిళిందం,బంభరం
నందనుడు = కుమారుడు, కొడుకు, పుత్రుడు, ఆత్మజుడు
నుతి = పొగడ్త, స్తోత్రము, స్తుతి
పడతి = స్త్రీ, ఉవిద, ఇంతి మహిళ,నవల,కొమ్మ
పవనాశనము = పాము, సర్పం, ఫణి
పావనం = పవిత్రం, పునీతం ,పూతం
పుటభేదనం = పట్టణం, నగరం, వీధి
బుధులు = పండితులు, విద్వాంసులు, కోవిదులు,
భానుడు = సూర్యుడు, అర్కుడు, పూషుడు, రవి
వసనం = వస్త్రం, ఉడుపు, వలువ
వెండి = కలధౌతం, రజతం
రంతు = క్రీడ, ఆట, కేళి, పెద్ద ధ్వని, గోల
వారిజం = పద్మం, సరసిజం, జలజం, తామర
వారిజగర్భుడు = బ్రహ్మ, చతుర్ముఖుడు, నలువ, విధి
శరధి = సముద్రం, వార్ధి, నీరధి, జలధి
సేతువు = వారధి, వంతెన

## నానార్థాలు

అక్షము = బండి ఇరుసు, కన్ను, సర్పం, జూదంలోని పాచిక
అనలము = అగ్ని, కృత్తిక, నల్లజీడి, మూడు అంకె
అనిమిషం = చేప, దేవత
అరుణం = ఎరుపు, కాంతి, కుష్టురోగం, బంగారం
అశని = వజ్రము, పిడుగు,
ఆస్తరణం = ఎఱ్ఱ కంబళి, పరుపు, ఆసనం, ఏనుగు మీద పరిచే ఎఱ్ఱ కంబళి
ఇనుడు = సూర్యుడు, ప్రభువు, పోషకుడు, భర్త
ఇల = బుధుని భార్య, ఆవు, మాట, భూమి
ఉల్క = నిప్పుకణం, బూడిద
ఎద = హృదయం, భయం
కంఠీరవం = సింహం, మత్తగజం, పావురం
కదళి = అరటి, ఏనుగు అంబారీ మీద టెక్కెం, ఇరవై అంగుళాల పొడవు ఉన్న లేడి,
కరము = చెయ్యి, మిక్కిలి, తొండము, కిరణము
కరి = నిదర్శనం, ఏనుగు, కోతి
కల్యాణం = శుభము, బంగారం, పెండ్లి, అక్షయం

© SCERT not to be republished

కాయం = శరీరం, సమూహం, స్వభావం,
కారు = దట్టము, అజ్ఞానం, పట్టకారు, వ్యర్థపుమాట
కాలం = సమయం, నలుపు, చావు, తాడి (చెట్టు)
కుడ్యం = గోడ, పూత
కుశ = తాడు, నీరు, దర్భ, ఒక ద్వీపం
కేతనం = జెండా, ఇల్లు
ఖగము = పక్షి, బాణం, సూర్యుడు (గ్రహాలు), గాలి
గుణం = దారం, స్వభావం, వింటినారి, విద్య
ఘటం = కుండ, సమూహం
చరణం = పాదం, వేరు, కులం, పద్యపాదం
జలం = నీరు, ఎఱ్ఱతామర, ఎఱ్ఱకలువ
జిహ్వ = నాలుక, వాక్కు, జ్వాల
తార = నక్షత్రం, వాలి భార్య, కంటిపాప, ఓంకారం
తీర్థం = పుణ్యనది, జలం, ఉపాధ్యాయుడు, మంత్రి
తుండం = పక్షి ముక్కు, నోరు, ఖండం
దక్షిణ = ఒకదిక్కు, సంభావన
దర్శనం = చూపు, కన్ను, అద్దం, బుద్ధి, శాస్త్రం
దాహం = దప్పిక, కాలుట
దిక్కు = దిశ, శరణం
ధర్మం = పుణ్యం, న్యాయం, ఆచారం, యజ్ఞం
ధ్వని = శబ్దం, వ్యంగ్యార్థం.
నందనుడు = కొడుకు, సంతోషి
పక్షం = వరుస, రెక్క, 15 రోజులు, వైపు
పదము = చిహ్నము, వాక్యము, స్థలము, కాలి అడుగు జాడ
పరిఘ = బాణం, కుండ దెబ్బ
పాకం = పంట, వంట, నారికేళాది కావ్యపాకాలు
పావనం = జలం , గోమయం, రుద్రాక్ష పవిత్రం
బుధుడు = పండితుడు, బుధగ్రహం, వేల్పు, వృద్ధుడు
వప్రం = కోట, వరిమడి తీరం
సూత్రం = నూలుపోగు, జంధ్యం, ఏర్పాటు
వివరం = రంధ్రం, దూషణ
హరి = విష్ణువు, సూర్యుడు, కోతి కప్ప, గుఱ్ఱం

## వ్యుత్పత్త్యర్థాలు

అంధకారం = లోకులను అంధులుగా చేసేది -చీకటి
అనలుడు = లోకమునకు జీవనాధారమైనవాడు -అగ్ని
అనిమిషులు = రెప్పపాటు లేనివారు - దేవతలు
అనిలుడు = ప్రాణులకు జీవనాధారమైనవాడు -వాయువు
అమృతం = మరణమును పొందింపనిది - సుధ
ఇతిహాసం = ఇలా జరిగిందని చెప్పేది - చరిత్ర
ఉరగము = పొట్టతో పాకేది -పాము
ఉర్వి = విశాలమైనది -భూమి
కంఠీరవం = కంఠంలో ధ్వని కలది - సింహం
క్ష్మ = భారం వహించడంలో ఓర్పుకలది - భూమి
కేశము = శిరస్సున ఉండేది - వెంట్రుక
ఖగం = ఆకాశంలో తిరిగేది - పక్షి
ఛాందసుడు = ఛందోరూపమైన వేదంచదివినవాడు -బ్రాహ్మణుడు
తార = దీనిచే నావికులు తరింతురు -చుక్క
దినకరుడు = దినాన్ని ఏర్పరిచేవాడు -సూర్యుడు
ధరణి = సమస్తాన్ని ధరించునది - భూమి
నందనుడు =సంతోషమును కలిగించువాడు- కొడుకు
భూజము = భూమినుండి పుట్టినది -చెట్టు
వారిజము = నీటినుండి పుట్టినది - పద్మం
వారిజగర్భుడు = పద్మము గర్భముగా (ఆవాసంగా) గలవాడు - బ్రహ్మ
శరధి = శరములకు (నీళ్ళకు) నిధి - సముద్రం
స్రవంతి = పర్వతాదుల నుండి స్రవించునది - నది

| ప్రకృతి | - | వికృతి |
|---|---|---|
| అగ్ని | -- | అగ్గి |
| నిముషము | -- | నిముసము |
| హృదయం | -- | ఎద, ఎడద |
| సింహం | -- | సింగం |
| పక్షి | -- | పక్కి |
| గుణము | -- | గొనము |
| గృహము | -- | గీము |
| చంద్రుడు | -- | చందురుడు |
| జట | -- | జడ |
| తీరము | -- | దరి, ఒడ్డు |
| గర్వం | -- | గరువము |
| గౌరవం | -- | గోవం |
| దీపము | -- | దివ్వె |
| ఆహారం | -- | ఓగిరం |
| పక్షము | -- | పక్కం |
| నిజము | -- | నిక్కము |
| గర్భము | -- | కడుపు |
| బ్రహ్మ | -- | బమ్మ |
| శయ్య | -- | సెజ్జ |
| శృంగారం | -- | బంగారం |
| సముద్రం | -- | సంద్రం |
| సంతోషం | -- | సంతసం |
| సుఖం | -- | సుకం |
| దక్షిణం | -- | దక్కినం |
| ముఖం | -- | మొగం |
| ఘటము | -- | కుండ |
| కార్యం | -- | కర్జము |
| వేల్పు | -- | వేలుపు |


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ
© SCERT not to be republished